మా కలం.. మీ గళం..

RNI : APTEL/ 2017/74310

# మన గళం

దిన పత్రిక

పబ్లిషర్స్ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎడిటర్ : నంద కిషోర్ సంపుటి : 08 సంచిక : 95 బుధవారం 17 - 09 - 2025 పేజీలు: 8 వెల: 4

## మసూద్ అజహర్ కుటుంబం ముక్కలైంది



2లో..






### వివేకా హత్య కేసులో తదుపరి

## కార్యాచరణపై సర్వత్రా ఆసక్తి

- వివేకా హత్య కేసుపై సుప్రీంకోర్టులో విచారణ
- తదుపరి దర్యాప్తుకు మేం రెడీ: సుప్రీంకోర్టుకు తెలిపిన సీబీఐ

మన గళం, న్యూఢిల్లీ : మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో తదుపరి దర్యాప్తు చేపట్టేందుకు తాము సంసిద్ధంగా ఉన్నామని కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) సుప్రీంకోర్టుకు తెలియజేసింది. పిటిషనర్లు కోరుతున్నట్లుగా విచారణను ముందుకు తీసుకెళ్లడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, అయితే

2 లో..

## గాజాలో ఇజ్రాయెల్ మారణహోమం



- గాజాలో ఇజ్రాయెల్ మారణహోమానికి పాల్పడిందన్న ఐరాస కమిషన్
- జాతి నిర్మూలన ఉద్దేశంతోనే దాడులు జరుగుతున్నాయని నివేదికలో వెల్లడి
- ఈ ఆరోపణలను తీవ్రంగా ఖండించిన ఇజ్రాయెల్ ప్రభుత్వం

మన గళం డెస్క్ : గాజాలో ఇజ్రాయెల్ మారణహోమానికి పాల్పడిందంటూ ఐక్యరాజ్యసమితికి చెందిన స్వతంత్ర దర్యాప్తు కమిషన్ సంచలన నివేదిక విడుదల చేసింది. 2023లో హమాస్‌తో యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఇజ్రాయెల్ బలగాలు గాజా పాలస్తీనీయులపై జాతి నిర్మూలనకు పాల్పడ్డాయని చెప్పడానికి బలమైన ఆధారాలున్నాయని నివేదిక పేర్కొంది. ఈ యుద్ధంలో ఇజ్రాయెల్ మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలకు పాల్పడిందని కమిషన్ ఆరోపించింది. అంతర్జాతీయ చట్టం ప్రకారం నిర్వచించిన ఐదు

2 లో..

## స్త్రీ శక్తి పథకం విజయవంతంగా అమలు అవుతుంది





- ఎంపీ నిధులతో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేస్తా - కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు

మనగళం, కర్నూలు సిటీ : కర్నూలు జిల్లాలోని ప్రతి నియోజకవర్గ కేంద్రం బస్టాండ్ లో ఎంపీ నిధుల నుంచి ఆర్వో ప్లాంట్స్ ఏర్పాటు చేస్తానని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. ఆర్టీసీ రాయలసీమ జోనల్ చైర్మన్ పూల నాగరాజు తో కలిసి కర్నూలు నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ ను ఎంపీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బస్టాండులో కల్పిస్తున్న సౌకర్యాలు, సమస్యల పై అడిగి తెలుసుకున్న ఎంపీ, ఉచిత బస్సు ప్రయాణ పథకంపై మహిళా ప్రయాణికులతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రం లో స్త్రీ శక్తి పథకం విజయవంతంగా అమలవుతుందన్నారు. ఉచిత బస్సు ప్రయాణం ద్వారా మహిళలు లబ్ధిపొందుతున్నారన్నారు. జిల్లాలో రోజుకు దాదాపు 35 నుంచి 40 వేల మంది దాకా స్త్రీ శక్తి పథకాన్ని వినియోగించుకుంటున్నారని చెప్పారు. ఆర్టీసీ బస్టాండ్ ను మరింత అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్.ఎం.ఎస్ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్, ఆర్టీసీ ఆర్ఎం శ్రీనివాసులు, డిపో 1, 2 మేనేజర్లు, అధికారులు పాల్గొన్నారు.

## ప్రజలకు సంతృప్తి స్థాయిలో సేవలందించాలి



- రెవెన్యూశాఖ పనితీరుపై చంద్రబాబు ఆగ్రహం

మన గళం, అమరావతి : ఎన్ని సార్లు చెబుతున్నా రెవెన్యూ శాఖ ప్రజలకు సంతృప్తి స్థాయిలో సేవలు అందించటం లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆక్షేపించారు. కలెక్టర్లు చూసే దస్త్రాల క్వాలిటీ ఎంత ఉందో కూడా తనిఖీ చేస్తానని స్పష్టం చేశారు. రెండు నెలల్లో 100 శాతం అన్ని ఫైళ్లు ఆన్‌లైన్‌లో ఉండాల్సిందేనని తేల్చిచెప్పారు. మానుప్యులేషన్ లేకుండా ఫోరెన్సిక్ ఆడిటింగ్ లాంటివి కూడా తీసుకువస్తామని చెప్పారు. నెక్స్ట్ జెన్ టెక్నాలజీ వైపు మనం ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. అవేర్ ద్వారా 42 రకాల సమాచారం కలెక్టర్లకు అందుతోందని గుర్తు చేశారు. ఆర్టీజీ జిల్లా కేంద్రాలు ఆక్టోబరు చివరినాటికి సిద్ధం అవుతాయని తెలిపారు. జిల్లాలోని

2 లో..

## డైరెక్టర్ నగరూరు రాఘవేంద్రకు ఘన సన్మానం

- శాలువా కప్పి,సత్కరించిన సుమన్ టీ.వి.అధినేత దూది సుమన్

(మన గళం న్యూస్ నెట్ వర్క్) : సుమన్ టీ.వి. కర్నూలు,నంద్యాల ఉమ్మడి జిల్లాలు,మహబూబ్ నగర్ జిల్లా ల ఫ్రాంఛైజీ పార్ట్ నర్,ఏ.పి.ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ నగరూరు రాఘవేంద్రకు ఘన సన్మానం జరిగింది. హైదరాబాద్ లోని సుమన్ టీవి కార్యాలయ ంలోని తన ఛాంబర్లో సుమన్ టీ.వి.అధినేత దూది సుమన్ డైరెక్టర్ నగరూరు రాఘవేంద్రను ఘనంగా సన్మానించారు. శాలువా కప్పి, పుష్పగుచ్ఛాన్ని అందజేసి, ఆయనను సత్కరించారు.



## టెక్నాలజీ సమగ్రంగా అమలు చేయండి



2 లో..

- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక



### వివేకా హత్య కేసులో తదుపరి

## కార్యాచరణపై సర్వత్రా ఆసక్తి

దీనిపై న్యాయస్థానం నుంచి స్పష్టమైన ఆదేశాలు రావాల్సి ఉందని సీబీఐ పేర్కొంది. మంగళవారం ఈ కేసుకు సంబంధించిన విచారణ సర్వోన్నత న్యాయస్థానం ముందుకు వచ్చింది. సీబీఐ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్.వి. రాజు వాదనలు వినిపించారు. ఈ కేసులో దర్యాప్తును మరింత కొనసాగించాలని పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా కోరారు. దీనిపై స్పందించిన సీబీఐ, కోర్టు ఆదేశాలు జారీ చేస్తే తాము విచారణ కొనసాగింపునకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేసింది. 2019లో జరిగిన వివేకానందరెడ్డి హత్యోదంతం అప్పట్లో తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ కేసు దర్యాప్తులో జాప్యం జరుగుతోందని, పూర్తిస్థాయిలో న్యాయం జరగలేదని పిటిషనర్లు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే వారు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సీబీఐ తన సన్నద్ధతను స్పష్టం చేయడంతో, ఇప్పుడు అందరి దృష్టి సుప్రీంకోర్టు తీర్పుపైనే నిలిచింది. దర్యాప్తు కొనసాగింపునకు న్యాయస్థానం గ్రీన్ సిగ్నల్ ఇస్తుందా లేదా అనే విషయంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఈ కేసులో కోర్టు వెలువరించబోయే తీర్పు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరోసారి చర్చనీయాంశంగా మారే అవకాశం ఉంది.

## గాజాలో ఇజ్రాయెల్ మారణహోమం



మారణహోమ చర్యల్లో నాలుగింటికి ఇజ్రాయెల్ పాల్పడిందని కమిషన్ తన 72 పేజీల నివేదికలో పేర్కొంది. ఒక వర్గానికి చెందిన వారిని చంపడం, వారికి తీవ్రమైన శారీరక, మానసిక హాని కలిగించడం, ఉద్దేశపూర్వకంగా ఆ సమూహాన్ని నాశనం చేసే పరిస్థితులను సృష్టించడం, జననాలను నిరోధించడం వంటి చర్యలు ఇందులో ఉన్నాయని వివరించింది. ఇజ్రాయెల్ నేతల వ్యాఖ్యలు, సైన్యం ప్రవర్తించిన తీరే వారి జాతి నిర్మూలన ఉద్దేశానికి నిదర్శనమని కమిషన్ అభిప్రాయపడింది. అయితే, ఈ నివేదికను ఇజ్రాయెల్ తీవ్రంగా ఖండించింది. ఇదొక 'వక్రీకరించిన, తప్పుడు నివేదిక' అని కొట్టిపారేసింది. ఈ కమిషన్‌లోని నిపుణులు 'హమాస్ ప్రతినిధులుగా' పనిచేస్తున్నారని ఇజ్రాయెల్ విదేశాంగ శాఖ ఆరోపించింది. "వాస్తవానికి ఇజ్రాయెల్‌లో మారణహోమానికి ప్రయత్నించింది హమాస్. 1,200 మందిని చంపి, మహిళలపై అత్యాచారాలు చేసి, కుటుంబాలను సజీవ దహనం చేసింది" అని ఇజ్రాయెల్ గుర్తుచేసింది. ఈ నివేదిక నిరాధారమైనదని ఇజ్రాయెల్ సైనిక అధికారి ఒకరు తెలిపారు. 2023 అక్టోబర్ 7న హమాస్ ఇజ్రాయెల్‌పై అకస్మాత్తుగా దాడి చేసి సుమారు 1,200 మందిని చంపడంతో ఈ యుద్ధం మొదలైంది. దీనికి ప్రతిగా ఇజ్రాయెల్ గాజాపై సైనిక చర్య ప్రారంభించింది. అప్పటి నుంచి ఇప్పటివరకు గాజాలో 64,905 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారని అక్కడి ఆరోగ్య శాఖ చెబుతోంది. గాజాలో 90 శాతానికి పైగా ఇళ్లు ధ్వంసమయ్యాయని, ఆరోగ్య, పారిశుద్ధ్య వ్యవస్థలు కుప్పకూలాయని, తీవ్ర ఆహార కొరత ఏర్పడిందని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల మండలి 2021లో ఈ స్వతంత్ర అంతర్జాతీయ దర్యాప్తు కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ నివేదిక ఐరాస అధికారిక ప్రకటన కానప్పటికీ, యుద్ధంపై ఇప్పటివరకు వచ్చిన అత్యంత బలమైన నివేదికగా దీనిని పరిగణిస్తున్నారు.

## చంద్రబాబు సర్కార్‌పై జగన్ ఫైర్



మన గళం, అమరావతి : ఉల్లి, టమాటా పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు నష్టపోతున్నారని, ఇందుకు చంద్రబాబు ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరే కారణమని వైసీపీ అధినేత జగన్ మండిపడ్డారు. ఈ మేరకు తన 'ఎక్స్' ఖాతా వేదికగా ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. పంట ధరల పతనంలో చంద్రబాబు ప్రభుత్వం కొత్త రికార్డులు సృష్టిస్తోందని జగన్ ఎద్దేవా చేశారు. "కర్నూలులో కిలో ఉల్లి ధర కేవలం మూడు రూపాయలు, కిలో టమాటా రూపాయిన్నరకు పడిపోయింది. ఈ ధరలతో రైతు ఎలా బతకాలి?" అని ఆయన ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. గత కొన్ని వారాలుగా రైతులు తీవ్ర ఆవేదనతో గగ్గోలు పెడుతున్నా, ప్రభుత్వం కనీసం కనికరం చూపడం లేదని దుయ్యబట్టారు. ప్రజలు, రైతులు కష్టాల్లో ఉన్నప్పుడు ఆదుకోలేని ప్రభుత్వం ఉండి ఏం లాభమని ఆయన నిలదీశారు.క్వింటా ఉల్లిని రూ.1,200కు కొనుగోలు చేస్తామన్న ప్రభుత్వ ప్రకటనలు కేవలం నామమాత్రంగానే మిగిలిపోయాయని జగన్ ఆరోపించారు. కర్నూలు మార్కెట్‌లో తూతూమంత్రంగా వేలం నిర్వహించి, కొనేవారు లేరనే అభిప్రాయాన్ని కలిగించే ప్రయత్నం చేశారని విమర్శించారు. రైతులకు గిట్టుబాటు ధర దక్కడం లేదని, కానీ అదే ఉల్లిపాయలు ఆన్‌లైన్ స్టోర్లలో కిలో రూ.29 నుంచి రూ.32 వరకు, రైతు బజార్లలో రూ.25కు అమ్ముతున్నారని ఆయన గుర్తుచేశారు. రైతులకు, రిటైల్ ధరలకు మధ్య ఇంత వ్యత్యాసం ఉండటానికి ప్రభుత్వ వైఫల్యమే కారణమని అన్నారు.

ఉల్లితో పాటు టమాటా రైతుల పరిస్థితి కూడా దయనీయంగా ఉందని, కొనేవారు లేక పంటను రోడ్ల పక్కన పారబోస్తున్నారని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని, రైతుల నుంచి పంటలను కొనుగోలు చేసి వారికి అండగా నిలవాలని, మానవత్వం చాటుకోవాలని డిమాండ్ చేశారు.

# మసూద్ అజహర్ కుటుంబం ముక్కలైంది

### భారత్ దాడిలో అజహర్ కుటుంబం హతం.. తొలిసారి అంగీకరించిన జైషే మహమ్మద్



మన గళం, ఇంటర్నెట్ డెస్క్: పాకిస్థాన్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న జైష్ ఏ మొహ మ్మద్ ఉగ్రవా ద సంస్థకు భారత్ చేతిలో గట్టి ఎదురు దెబ్బ తగిలిన విష యాన్ని ఆ సంస్థ తొలిసారిగా బహిరంగంగా అంగీకరించింది. భారత సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'లో భాగంగా పాకిస్థాన్‌లోని బహావల్‌పూర్‌లో జరిపిన వైమానిక దాడిలో తమ అధినేత మసూద్ అజహర్ కుటుంబ సభ్యులు మరణించినట్లు ధృవీకరిం చింది. ఈ మేరకు జైష్ అగ్ర కమాండర్లలో ఒకరైన మసూద్ ఇలియాస్ కశ్మీరీ మాట్లాడిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. మే 7వ తేదీన బహావల్‌పూర్‌లోని జైష్ ప్రధాన కార్యాలయం 'జామియా మసీదు సుభాన్ అల్లా'పై భారత బలగాలు జరిపిన దాడిలో మసూద్ అజహర్ కుటుంబం తీవ్రంగా నష్టపోయిందని ఆ కమాండర్ పేర్కొన్నాడు. "మే 7న భారత బలగాలు మౌలానా మసూద్ అజార్ కుటుంబాన్ని ఛిద్రం చేశాయి" అని కశ్మీరీ ఆ వీడియోలో ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ దాడిలో అజహర్ సోదరి, ఆమె భర్త, మేనల్లుడు, మేనకోడలు, ఇతర సమీప బంధువులు మొత్తం 10 మంది మరణించినట్లు సమాచారం. వారితో పాటు అజహర్ ప్రధాన అనుచరులైన నలుగురు సహాయకులు కూడా హతమయ్యారు. ఏప్రిల్ 22న పహల్గామ్‌లో 26 మంది మృతికి కారణమైన ఉగ్రదాడికి ప్రతీకారంగానే భారత్ 'ఆపరేషన్ సిందూర్'ను చేపట్టింది. బహావల్‌పూర్‌తో పాటు మరో ఎనిమిది ఉగ్రవాద శిబిరాలను కూడా భారత సైన్యం ధ్వంసం చేసింది. ఈ దాడిలో మసీదులోని ఒక డోమ్ దెబ్బతిన్నట్లు, లోపల తీవ్ర నష్టం వాటిల్లినట్లు ఉపగ్రహ చిత్రాలు వెల్లడిస్తున్నాయి.

అయితే, ఈ దాడి గురించి పాకిస్థాన్ ప్రభుత్వం ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి ప్రకటనా చేయలేదు. కానీ, అజహర్ కుటుంబ సభ్యులకు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు జరిపినట్లు ప్రత్యక్ష సాక్షులు, అంతర్జాతీయ మీడియా సంస్థలు నివేదించాయి. ఆ కార్యక్రమానికి మసూద్ అజహర్ కూడా హాజరై కొద్ది నిమిషాల్లోనే అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు సమాచారం.

# ప్రజలకు సంతృప్తి స్థాయిలో సేవలందించాలి

అత్యుత్తమ పరిశ్రమ, యూనివర్సిటీ, బ్యాంకు లీడ్ పార్టనర్‌గా ఓ ఎకోసిస్టంను తయారు చేయాలని సూచించారు. టెక్నాలజీ అంశాలపై అక్టోబరు నెలలో మంత్రులు, హెచ్‌ఓడీలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నట్లు సీఎం వెల్లడించారు. సీసీటీవీ అనలటిక్స్, ఆర్టీఐహెచ్ పైనా కలెక్టర్ల సదస్సులో చర్చించారు. నవంబరులోగా డేటాలేక్ పూర్తిగా అందరికీ అందుబాటులోకి వస్తుందని తెలిపారు. వచ్చే కలెక్టర్ల సదస్సు నాటికి జిల్లాలు ఎక్కడ ఇంప్రూవ్ చేసుకోవాలో కూడా రియల్ టైమ్?లోనే చెప్పేలా వ్యవస్థ ఉండాలని దిశానిర్దేశం చేశారు.

బ్యాండ్ విడ్త్‌లేని సమయం నుంచి అత్యధిక బ్యాండ్ విడ్త్‌తో పనిచేసే సమయం వచ్చిందని గుర్తు చేశారు. క్వాలిఫికేషన్ కలిగిన యువ అఖిల భారత సర్వీసు అధికారుల సేవల్ని వినియోగించుకుంటామని వివరించారు. ఏపీలో టెక్నాలజీ ఎకో సిస్టం క్రియేట్ చేసేందుకు ఐదుగురు యువ అధికారులను నియమించామని తెలిపారు. లాస్ట్ మైల్ వరకూ ప్రయోజనాలు అందేలా టెక్నాలజీ వినియోగించాలని సూచించారు. వచ్చే రెండేళ్లలో ఈ ఫలితాలను కూడా అందుకోవచ్చునని తెలిపారు. ప్రభుత్వ శాఖలు అందించే వివిధ సేవలకు సంబంధించి సర్వీస్ రేటింగ్ చేస్తున్నామని, అన్ని ప్రభుత్వ సేవల్ని రేటింగ్ చేయాలని నిర్ణయించిన్నట్లు వెల్లడించారు. ఐటీ, క్వాంటం వ్యాలీ, వాట్సప్ గవర్నెన్స్, డేటా లేక్, ఆర్టీజీఎస్ లెన్స్, అవేర్ 2.0 అంశాలపై సమీక్ష నిర్వహించారు.



# రెవెన్యూలో టెక్నాలజీ సమగ్రంగా అమలు చేయండి

మన గళం, అమరావతి : రెవెన్యూలో టెక్నాలజీ ఇంటిగ్రేషన్ త్వరితగతిన పూర్తి చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు. ఇవాళ(మంగళవారం) ఏపీ సచివాలయంలో రెవెన్యూ, భూములు, ఆదాయార్జన శాఖలపై కలెక్టర్ల సదస్సు జరిగింది. ఈ సదస్సులో అధికారులకు సీఎం చంద్రబాబు పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు. సింహాచల భూముల పంచ గ్రామాల సమస్యను తక్షణం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పీజీఆర్ఎస్‌లో వచ్చిన ఫిర్యాదులు పెద్దమొత్తంలో పరిష్కారం అవుతాయని తెలిపారు పోలీసు, రెవెన్యూ విభాగానికి వచ్చిన ఫిర్యాదులో 70 శాతం మేర ఉన్నాయని గుర్తుచేశారు. ఆర్‌ఓఆర్‌కు సంబంధించిన ఫిర్యాదులే ఎక్కువగా ఉన్నాయని వివరించారు. గత పాలకుల తప్పులతో ఈ స్థాయిలో ఏపీలో రెవెన్యూ, భూ వివాదాల ఫిర్యాదులు వచ్చాయని పేర్కొన్నారు సీఎం చంద్రబాబు. జీఎస్టీ 2.0 సంస్కరణలతో రాష్ట్ర ప్రజలకు రూ.8 వేల కోట్ల మేర ప్రయోజనం ప్రతీ ఏడాది కలుగుతుందని పేర్కొన్నారు. పన్నుల తగ్గింపుపై ఈ నెల 19వ తేదీన నోటిఫికేషన్లను జారీ చేసేలా కార్యాచరణ రూపొందించామని తెలిపారు. గ్రామస్థాయి వరకూ ఏ వస్తువుకు ఎంత పన్ను తగ్గిందన్న అంశాలను ప్రజలకు తెలిసేలా ఓ ప్రకటన జారీ చేస్తామని వివరించారు. జీవిత భీమా, ఆరోగ్య భీమాపై ఇప్పుడు జీఎస్టీ లేదని స్పష్టం చేశారు. యూనివర్సల్ హెల్త్ కార్డుపై ఏ మేరకు ప్రయోజనం కలుగుతుందో అంచనా వేయాలని సూచించారు సీఎం చంద్రబాబు.

**– జీఎస్టీ తగ్గింపుపై అవగాహన..**

జీఎస్టీ పన్నుల తగ్గింపు ప్రయోజనాలపై నెల రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. సెప్టెంబరు 22వ తేదీ నుంచి అక్టోబరు 22వ తేదీ వరకూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొనేలా కార్యాచరణ రూపొందిస్తామని వెల్లడించారు. జిల్లాల నుంచి జీఎస్టీ, పన్ను ఆదాయాలు ఎలా ఉన్నాయన్న విషయంపై కూడా పర్యవేక్షణ చేయాలని సూచించారు. మైనింగ్ ఆదాయంలో ఏ జిల్లాలు వెనుకంజలో ఉన్నాయో అంచనా వేస్తామని చెప్పుకొచ్చారు. జిల్లాల వారీగా మైనింగ్ ఆదాయం పెరగాలని మార్గనిర్దేశం చేశారు. ఉచిత ఇసుక విధానంలో ప్రజల్లో సంతృప్తి స్థాయి రావాలని పేర్కొన్నారు. రూ.1000 కోట్ల రెవెన్యూను ప్రభుత్వం కోల్పోయి ప్రజలకు ఉచిత ఇసుక అందిస్తోందని వెల్లడించారు. ఇలాంటి అంశాల్లో ప్రజలు సంతృప్తి చెందేలా అధికారుల పనితీరు ఉండాలని సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు



# జగన్‌కి సానుభూతి నటన తప్ప రైతులపై చిత్తశుద్ధి లేదు

- రైతుల పట్ల జగన్ మొసలి కన్నీరు కారుస్తున్నారు
- రైతాంగం అభివృద్ధిపై జగన్‌కు చిత్తశుద్ధిలేదు
- మంత్రి అచ్చెన్నాయుడు

మన గళం, అమరావతి : వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై మంత్రి అచ్చెన్నాయుడు సంచలన వ్యాఖ్యలు చేశారు. రైతుల పట్ల జగన్ మొసలి కన్నీరు కారుస్తున్నారని ధ్వజమెత్తారు. రైతాంగం అభివృద్ధిపై చిత్తశుద్ధిలేని జగన్ అబద్ధపు సానుభూతి నటన కనపరుస్తున్నారని మండిపడ్డారు. ఇవాళ(మంగళవారం) అమరావతి వేదికగా మీడియాతో మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడారు. జగన్ పాలనలో రైతులు కంటతడి పెట్టారని విమర్శించారు. జగన్‌కు పంట మద్దతు ధర విధానం తెలుసా అని ప్రశ్నించారు. రైతులకు అండగా నిలబడటం అంటే డ్రామాలు కాదని, క్షేత్రస్థాయిలో ఫలితాలు చూపించాలని సవాల్ విసిరారు. ఉల్లి, టమాటా రైతుల దీనస్థితి అంటూ జగన్ మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. రైతుల కష్టాలను నిజంగా పట్టించుకునే హృదయం జగన్‌కి ఉంటే.. తన పాలనలో రైతులను ఎందుకు దోపిడీకి గురి చేశారని ప్రశ్నించారు మంత్రి అచ్చెన్నాయుడు. రైతుల పట్ల కనీసం చిత్తశుద్ధి లేని జగన్ ఇప్పుడొచ్చి అబద్ధపు సానుభూతి నటన కనపరుస్తున్నారని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉల్లి, టమాటా రైతుల కోసం ప్రత్యేక చర్యలు తీసుకుని, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, మద్దతు ధర చెల్లించిందని గుర్తు చేశారు. మద్దతు ధరలు, రైతుల గురించి మాట్లాడే కనీస అర్హత జగన్‌కు లేదని ఫైర్ అయ్యారు. రైతులకు అండగా నిలబడటం అంటే డ్రామాలు కాదని.. క్షేత్ర స్థాయిలో ఫలితాలు చూపించడమేనని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.



మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# కరోనాలో తొలగించిన స్వీపర్లను విధుల్లోకి తీసుకోవాలి



మనగళం, కర్నూలు సిటీ : కరోనాలో తొలగించిన 11 మంది ఆర్టీసీ స్వీపర్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ ఆర్టీసీ రాయలసీమ రీజన్ చైర్మన్ పూల నాగరాజు, ఎంపీ బస్తిపాటి నాగరాజుకు సీఐటీయూ నాయకులు వినతి పత్రం అందజేశారు. సీఐటీయూ నగర అధ్యక్షులు నగేష్, కోశాధికారి సాయి బాబా, ఆర్టీసీ స్వీపర్స్ యూనియన్ నాయకులు ఈ సందర్భంగా స్వీపర్ల సమస్యలను వారికి విన్నవించారు. గతంలో ఆర్టీసీలో 43 మంది స్వీపర్లు పనిచేస్తుండగా కరోనా సమయంలో చాలామందిని తొలగించారు. అనేకమార్లు విన్నవించాక కొంతమందిని వీధిలోకి తీసుకున్నారని, మిగిలిన 11 మంది విధుల్లోకి తీసుకోవాలని కోరారు. స్పందించిన చైర్మన్ వెంటనే 11 మంది కార్మికులను విధుల్లోకి తీసుకునేలాగా ఈడీకి ప్రపోజల్ పెట్టమని ఆర్ఎంను ఆదేశించారు. ఎంపీతోపాటు ఆర్టీసీ చైర్మన్, కర్నూలు డీఎంకు సీఐటీయూ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

# మిద్దె తోట పెంపకదారులకు బహుమతులు

- నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్
- ఔత్సాహికులు సచివాలయాల్లో వివరాలు ఇవ్వాలి
- 20న కార్పొరేషన్ కార్యాలయం, శానిటేషన్ డివిజన్లలో మొక్కల పంపిణీ



మనగళం, కర్నూలు కార్పొరేషన్ : కర్నూలు నగరాన్ని పచ్చదనంతో తీర్చిదిద్దేందుకు "స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమం లో భాగంగా "హరిత ఆంధ్ర" అంశం తో ప్రత్యేక కార్యక్రమం నిర్వహి స్తున్నట్లు నగరపా లక కమిషనర్ పి.. విశ్వనాథ్ మంగళవారం ఒక ప్రకటన లో తెలిపారు. ఈ కార్యక్రమం లో భాగంగా ప్రతి ఇంటి మేడపై, అపార్టు మెంట్ల బాల్కనీల లో మొక్కలు, పండ్ల చెట్లు, కూరగాయ లు పెంచడాన్ని ప్రోత్స హిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉత్తమంగా తోటలు పెంచుతున్న ఔత్సాహికులకు నగరపాలక సంస్థ నుండి బహుమతులు అందజేయబడతాయని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు తమ పేర్లను సంబంధిత సచివాలయం పరిధిలోని శానిటేషన్ కార్యదర్శుల వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు. నమోదు చేసిన తోటలను శానిటేషన్ కార్యదర్శులు, స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు పరిశీలించి ఉత్తమమైన వారిని ఎంపిక చేస్తారని వెల్లడించారు. మొత్తం పదహారు శానిటేషన్ డివిజన్లో పరిధిలో అలాగే నగరపాలక సంస్థ కార్యాలయంలో ఈ నెల 20న ఉచితంగా మొక్కల పంపిణీ కార్యక్రమం జరుగుతుందని, అంతేకాక ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, వివిధ సంస్థలు తమ పరిసరాలను హరిత ప్రాంగణాలుగా తీర్చిదిద్దాలని కోరారు. ఈ లక్ష్య సాధనలో స్వయం సహాయక సంఘాల సభ్యులు, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొనాలని నగరపాలక సంస్థ విజ్ఞప్తి చేస్తుందన్నారు. మొక్కల పంపిణీ నగరపాలక కార్యాలయంతో పాటు పదహారు శానిటేషన్ విభాగాల ద్వారా నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. ప్రతి గృహం, ప్రతి కార్యాలయం, ప్రతి పాఠశాల, హాస్టల్స్ ఒక తోటగా మారితే, కర్నూలు నిజమైన స్వచ్ఛ హరిత నగరంగా అవతరిస్తుందని కమిషనర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# వీఓఏల సమస్యలు పరిష్కరించాలి



మనగళం, కర్నూలు కలెక్టరేట్ : సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వెలుగు వీఓఏల(యానిమేటర్స్) సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నాయకుడు గుంటెప్ప అధ్యక్షతన కర్నూలు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షులు పీయస్.రాధాక్రిష్ణ మాట్లాడుతూ జిల్లాలో వీఓఏల ఆన్లైన్ వర్క్ లతో సతమతమ వుతున్నారని, ఫేస్ యాప్ తో అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆన్లైన్ వర్కులు వెంటనే తగ్గించాలని, ఫేస్ యాప్ ని తొలగించా లని డిమాండ్ చేశారు. సమస్యలతో సతమతమవుతున్న వీఓఏలను రాజకీయ నాయకులు అక్రమ తొలగింపులు ఎక్కువ య్యాయని, కర్నూలు జిల్లాలో 150 మందికి పైగా తొలగిస్తే ఎలా అని ప్రశ్నించారు. కోర్టు ఆర్డర్ వచ్చినా అధికారులు అమలు చేయడం లేదని, దీనిపై గట్టిగా అడిగితే రాజకీయ నాయ కులు ఒప్పు కుంటే మేము చేస్తా మని నేరుగా అధికారులే తెలుపు తు న్నారని ఆరోపించారు. గతంలో మూడు రోజు ల సమ్మె ఫలితంగా సర్ఫ్ సీఈఓ కొన్ని హామీలు ఇచ్చారని, అయితే ఇప్పటికీ అమలు కాలే దని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు వెంకట స్వా మి, మారెప్ప,రాజమ్మ,షబిరాబేగామ్,తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

– పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి



మనగళం, పాణ్యం : ప్రజా సమస్యల పరిష్కార మే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి తెలిపారు. పాణ్యం ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామల సర్పంచ్ లు, ఎంపీటీసీ సభ్యులు ప్రజా సమస్యలను సభ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ అధికారులు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ప్రజాప్రతినిధులు విన్నవించిన సమస్యపై అధికారులు సానుకూలంగా స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల క్షేమం, అభివృద్ధి కూటమి ప్రభుత్వ ధ్యేయమని, అధికారులు అంకితభావంతో సహకారం అందజేయాలని కోరారు.

# మంత్రి భరత్ పై ఆరోపణలను ఖండించిన ఎంపీ బస్తిపాటి నాగరాజు



మనగళం, కర్నూలు సిటీ : కర్నూలు నగరంలోని ప్రభుత్వ క్వార్టర్స్ విషయంలో మంత్రి టీజీ భరత్ పై వస్తున్న ఆరోపణలను కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు ఖండించారు. క్వార్టర్స్ లో ఉన్న వారిని మంత్రి బలవంతంగా ఖాళీ చేయిస్తున్నారంటూ కొంత మంది దుష్ప్రచారాలు చేయడం సమంజసం కాదన్నారు. ప్రభుత్వం పై ప్రజల్లో వ్యతిరేకత తీసుకువచ్చేందుకు మంత్రి పై తప్పుడు ప్రచారలు చేస్తున్నారని మండిపడ్డారు. కొన్ని సంవత్సరాల నుంచి చాలా మంది అనధికారికంగా నివసిస్తున్నారని, ఇండ్లు కూడా శితిలావస్థకు చేరుకున్నాయన్నారు. దాదాపు 9 వందల ఎకరాలకు పైగా క్వార్టర్స్ స్థలం ఉందని, ఆ స్థలాన్ని అభివృద్ధిచేసుకోవాల్సిన అవసరం ఉందని ఎంపీ తెలిపారు.

# అట్టడుగు వర్గాల అభివృద్ధికి కృషి చేద్దాం





మనగళం, కర్నూలు సిటీ : కేవీపీఎస్ న్యూ సిటీ మాజీ ఉపాధ్యక్షులు దివంగత వెంకటస్వామి స్ఫూర్తితో అట్టడుగు వర్గాల అభివృద్ధి కోసం ఉద్యమిద్దామని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం డి ఆనంద్ బాబు పిలుపునిచ్చారు. మంగళవారం కర్నూల్ నగరంలోని శరీన్ నగర్ లో వెంకటస్వామి గృహంపై వెంకటస్వామి రెండవ వర్ధంతిని నిర్వహించారు. కేవీపీఎస్ న్యూ సిటీ అధ్యక్షులు యేసు రాజు అధ్యక్షతన జరిగిన వర్ధంతి కార్యక్రమంలో ముందుగా వెంకటస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అనంతరం ఎండి ఆనంద్ బాబుతోపాటు న్యూ సిటీ కార్యదర్శి ఎం భాస్కర్, న్యూ సిటీ ఉపాధ్యక్షులు ఆర్ పెద్ద బాబు, వెంకటస్వామి తనయుడు శ్రీనివాసులు మాట్లాడారు. దివంగత వెంటకటస్వామి సేవలను వారు గుర్తు చేశారు. అనంతరం తండ్రి ఆశయాలకు అనుగుణంగా డీఎస్సీలో విజయం సాధించిన తనయుడు శ్రీనివాసులను సంఘం నాయకులు శాలువా పూలమాలతో సత్కరించి, అభినందించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ న్యూ సిటీ సహాయ కార్యదర్శి చిన్న ఆనంద్, నాయకులు రామాంజనేయులు, పెద్ద మధు, మరియమ్మ, సరోజమ్మ, వెంకటస్వామి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# 28న కర్నూలులో జాతీయ కవయిత్రుల సమ్మేళనం



మనగళం, కర్నూలు సిటీ : కర్నూలులో ఈనెల 28న ఎనిమిదవ జాతీయ కవయిత్రుల సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు గణేష్ సాహితీ సంస్థ, జనతా ఫౌండేషన్ అధినేత కొత్తూరు సత్యనారాయణ గుప్తా తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమం గణేష్ సాహితీ సదన్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ప్రారంభం అవుతుందని, ఉత్సాహం ఉన్న కవయిత్రులు హాజరు కావాలని కోరారు. ఈనెల 22వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వాట్సాప్ నెంబర్ 94402 28999 కు పేరు, ఊరు పంపించాలని ఆయన సూచించారు. 2018 నుంచి జాతీయస్థాయిలో కవయత్రులతో సమ్మేళనం కర్నూలు లో నిర్వహిస్తూ వస్తున్నామని ఈ సందర్భంగా గుప్త గుర్తు చేశారు. సాహిత్యంలో రాణించిన... రాణిస్తున్న కవయిత్రులు ఒకే వేదికపైకి తీసుకురావడం ఫౌండేషన్ ముఖ్య ఉద్దేశ్యమని ఆయన తెలిపారు.

# కేఎంసీ పీజీ విద్యార్థినికి మొదటి బహుమతి

మనగళం, కర్నూలు సిటీ : జాతీయస్థాయిలో కోయంబత్తూరులో ఇటీవల నిర్వహించిన పీడియాట్రిక్ సర్జరీ విభాగపు నేషనల్ కాన్ఫరెన్స్ , స్పాకాన్ యందు కర్నూల్ మెడికల్ కాలేజీ యందు చదువుతున్న పీడియాట్రిక్ సర్జరీ విభాగపు పీజీ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని డా. ప్రియాంక ఇ- పోస్టర్ విభాగం లో జాతీయ స్థాయిలో మొదటి బహుమతి సాధించారు. అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ కే.చిట్టి నరసమ్మ విద్యార్థినితోపాటు పీడియాట్రిక్ సర్జరీ విభాగపు అధిపతి డా. శివకుమార్, విభాగపు వైద్యులను అభినందించారు. డా. ప్రియాంక ను ఆదర్శంగా తీసుకోవాలని జాతీయ స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందిస్తామని ఆమె తెలిపారు.




# జైళ్లను తనిఖీ చేసిన ప్రధాన న్యాయమూర్తి



మనగళం, కర్నూలు సిటీ : జిల్లా ప్రధాన న్యాయ మూర్తి, జిల్లా న్యాయ సేవాది కార సంస్థ అధ్యక్షులు జి. కబర్థి, బి. లీలా వెంకట శేషాద్రి కార్యదర్శి, జిల్లా న్యాయ సేవాదికార సంస్థ, కర్నూలు పురుషుల, మహిళ కారాగారాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి జైలు ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్ ను తనిఖీ చేశారు. "జైలు ఖైదీలకు ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్స్" గురించి వివరించారు. ఇందులో ఒక అడ్వకేట్, ఒక ప్యారా లీగల్ వాలంటీర్ ఉంటారని, వారు ఖైదీలకు న్యాయ సహాయాలు అందిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా

జైలులో ఉన్న ఖైదీలు సత్ప్రవర్తనతో శిక్షను పూర్తి చేయాలని కోరారు. ఖైధి లకు ఎవరికైనా న్యాయవాదులు లేకుంటే ఉచితంగా నియమిస్తామని తెలిపారు. 70 ఏళ్ళు వయస్సు పై బడిన ఖైదీలకు, అనారోగ్యంతో బాధ పడే వారికి ఉచిత న్యాయ సహాయం అందిస్తా మని, త్వరగా బెయిల్ మంజూరు అయ్యేలా కృషి చేస్తామని తెలిపారు. ఖైదీ లకు అందించే ఆహారాన్ని, రేషన్ ను వారి ఆరోగ్యం గురించి తీసుకుంటున్న చర్యలను పరిశీలించారు. ఖైదీలను కోర్ట్ వాయిదా లకు కచ్చితంగా హాజరు చెయ్యాలని ఆదేశించారు. ఏవైనా సమస్యలుంటే కర్నూలు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థను సంప్రదించవచ్చును అన్నారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 పై ప్రచారం నిర్వహించడం జరిగినది. కార్యక్రమంలో జైలు అధికారులు, లీగల్ ఎయిడ్ న్యాయవాదులు శివరాం, సులోచన తదితరులు పాల్గొన్నారు.

# అబ్జర్వేషన్ హోమ్ ను పరిశీలించిన ప్రధాన న్యాయమూర్తి



మనగళం, కర్నూలు సిటీ : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయ మూర్తి జి. కబర్థి, కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి సోమవారం కర్నూలులోని అబ్జర్వేషన్ హోమ్ ఫర్ బాయ్స్ ను తనిఖీ చేశారు. అక్కడ ఉన్న పిల్లలకు ఎవరికైనా న్యాయవాది లేకుంటే ఉచితంగా నియమించి వారి కేసులను పరిష్కరిస్తామని తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి బాలలకు సంబందించిన చట్టాలు, ఉచిత న్యాయ సహాయం గురించి తెలియజేశారు. పిల్లలు లీగల్ సర్వీసెస్ ఆక్ట్ 1987 ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందుటకు అర్హులని తెలిపారు. కార్యక్రమంలో అబ్జర్వేషన్ హోమ్ సూపరింటెండెంట్ హుస్సేన్ బాషా, డిస్టిక్ ప్రొబేషనరీ ఆఫీసర్ దివాకర్, సిడబ్ల్యూసీ చైర్మన్ జుబేదాబేగం, జూవే నైల్ జస్టిస్ బోర్డు మెంబెర్స్ సునీత మాధవి తదితరులు పాల్గొన్నారు.

# నేను ప్రజా..సేవకున్ని

- ప్రజాభిమానం చూరగొన్నందునే రెండో పర్యాయం..సర్పంచ్ నయ్యా
- దాదాపుగా రూ.9 కోట్ల నిధులతో గ్రామాన్ని ప్రగతి పథాన..నడిపా
- గ్రామస్థులు ఆదరించి,ఆశీర్వదిస్తే..మరోసారి సర్పంచ్ ఎన్నికల బరిలో..నిలుస్తా
- మన గళం ఇంటర్వ్యూ లో సల్కాపురం సర్పంచ్ మద్దిలేటి



(మన గళం,కర్నూలు ప్రత్యేక ప్రతినిధి) : తనకు ప్రజలే ముఖ్యమని, తానో ప్రజా సేవకున్నని నంద్యాల జిల్లా, పాణ్యం నియోజకవర్గం,కల్లూరు మండలం,సల్కాపురం గ్రామ సర్పంచ్ మద్దిలేటి అన్నారు. గతంలోనే సర్పంచ్ గా పని చేసిన తాను, గ్రామాన్ని అన్ని విధాలుగా డెవలప్ చేసి, ప్రజాభిమానాన్ని చూరగొన్నందునే ప్రస్తుతం గత 12 ఏళ్లుగా రెండో సారి సర్పంచ్ గా కొనసాగుతున్నానని ఆయన స్పష్టం చేశారు. ఈ రెండు పర్యాయాల పదవీ కాలంలో దాదాపుగా రూ.9 కోట్ల మేర నిధులతో గ్రామ ప్రగతికి శ్రమించి, స్థానిక సమస్యల పరిష్కారానికి పాటుపడ్డానని ఆయన చెప్పారు. మరో 6 నెలల కాలంలో సర్పంచ్ ల పదవీ కాలం ముగియనున్న నేపథ్యంలో గ్రామస్థులు ఆదరించి, ఆ:శీర్వదిస్తే..మరోసారి సర్పంచ్ ఎన్నికల బరిలో తాను ఖచ్చితంగా నిలిచి, గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. మన గళం ప్రత్యేక ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు విషయాలను వెల్లడించారు. ఆ ఇంటర్వ్యూ సారాంశమిది...

మ.ప్ర.ప్ర: ముందుగా..మీ కుటుంబ నేపథ్యమేంటి ?

స.మ: మాది వ్యవసాయ కుటుంబం. మా తాత,తండ్రి గ్రామంలో రచ్చకట్ట పెద్దలుగా పేరొందారు. కాంగ్రెస్ పార్టీలో మా తాత,తండ్రి కాలం నుంచి మేమున్నాం.

మ.ప్ర.ప్ర: మీకున్న విద్యార్హతలేంటి ? మీ విద్యాభ్యాసం ఎక్కడెక్కడ,ఎంతదాకా సాగింది ?

స.మ: నేను డిగ్రీ దాకా చదివాను. పదో తరగతి దాకా స్వగ్రామం,పెద్దపాడులోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసించాను. ఆనక ఇంటర్ కోర్సును కర్నూలు న గరంలోని కోల్స్ కళాశాలలో, డిగ్రీ కోర్సును ఎస్టీబీసీ కళాశాలలో చదివాను.



మ.ప్ర.ప్ర: విద్యాభ్యాసానంతరం బతుకు బండిని లాగేందుకు మీరేం చేశారో తెలుసుకోవచ్చా ?

స.మ: నా విద్యాభ్యాసానంతరం నేను బతికేందుకు ఎల్.ఐ.సి.ఏజెంట్ గా పని చేశాను.

మ.ప్ర.ప్ర: మీ రాజకీయ అ(తె)రంగేట్రం ఎప్పుడు, ఏ విధంగా జరిగింది ?

స.మ: మా కుటుంబం మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీలో ఉంది. పాణ్యం నియోజకవర్గం మాజీ శాసనసభ్యుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి ఆశీస్సులతో నాకు 2013 లో సర్పంచ్ ఎన్నికల్లో అవకాశమొచ్చింది.

మ.ప్ర.ప్ర: ఆ 2013 ఎన్నికల్లో మీకు ఎంత మెజార్టీ వచ్చింది ?

స.మ: ఆ ఎన్నికల్లో నాకు 135 ఓట్ల మెజారిటీ వచ్చింది.

మ.ప్ర.ప్ర: మీరు ప్రస్తుతం రెండో పర్యాయం సల్కాపురం గ్రామ సర్పంచ్ గా ఉన్నారు. అంటే కాంగ్రెస్ తరపున తొలిసారి సర్పంచ్ గా ఎన్నికైన మీరు ప్రస్తుతం వైకాపాలో చేరారు. ఇలా..పార్టీలు ఎందుకు మారాల్సి వచ్చింది ?

స.మ: మేం..నేత కాటసాని రాంభూపాల్ రెడ్డి అనుచరులం. ఆయన వైకాపాలో చేరడంతో నేను ఆ పార్టీలో చేరాను.

మ.ప్ర.ప్ర: రెండో పర్యాయం సర్పంచ్ ఎన్నికల బరిలో నిలిచిన మీకు ఎంత మెజార్టీ వచ్చింది ?



స.మ: రెండోసారి సర్పంచ్ గా నేను నిలిచిన సందర్భంగా నాకు 39 ఓట్ల మెజార్టీ వచ్చింది.

మ.ప్ర.ప్ర: రెండు పర్యాయాలు గ్రామ సర్పంచ్ అయిన మీరు మీ గ్రామ ప్రగతికి ఏ విధంగా శ్రమించారు ?

స.మ: ప్రజలేదడిగితే అది చేశా. ఇచ్చిన మాట తప్పలేదు. మాకు 1985 లో ప్లాట్లు ఇచ్చారు వెంచర్లో, సత్యనారాయణ నగర్ అనే చోట రోడ్లు,డ్రెయిన్లు,కుళాయిలు లేవు. రోడ్లు వేసి, కుళాయిలు ఇచ్చాం. 150 కుటుంబాలుంటాయి.

మ.ప్ర.ప్ర: మీ గ్రామానికి వచ్చే క్రమంలో మేం గమనించాం. ప్రతి ఇంటి ముందు ఓ కుళాయి ఉంది. అంటే నీటి సమస్య అన్నదే మీ గ్రామానికి లేదంటారా ?

స.మ: గతంలో ఉప్పు నీరుండేది. 2013 కన్నా ముందు, నేనొచ్చాక రెండో పర్యాయం సర్పంచ్ గా గెలిచాక మా ఊరి నుంచి చెన్నరాయని తిప్ప అని 9 కిలోమీటర్ల మేర రూ.9 కోట్లతో తాగునీరిచ్చాం. ఊర్లో బోర్లను తీసేశాం. ప్రస్తుతం తిప్ప నుంచి వచ్చే నీటినే వినియోగిస్తున్నాం.

మ.ప్ర.ప్ర: జల్ జీవన్ మిషన్ అనే పథకం మీ గ్రామంలో అమలవుతోందా ?

స.మ: రూ.40 లక్షల నిధులతో ఈ పథకం అమలవుతోంది. ఓ ప్లేస్ను ఎంచుకని కొత్త ట్యాంకును కట్టి, పైప్ లైన్లిచ్చాం.

మ.ప్ర.ప్ర: మీ హయాంలో వందలాది మందికి ఇళ్ల పట్టాలిప్పించారంటారు. ఇది వాస్తవమేనా ?



స.మ: వాస్తవమే. ఎస్సీలకు 99,బీసీలకు 129 పట్టాలిచ్చాం.2014-15లో ఇది జరిగింది. ఎమ్మెల్యే కాటసాని చొరవతో ఇది విజయవంతంగా చేశాం.

మ.ప్ర.ప్ర: రెండు పర్యాయాలు మీరు సర్పంచ్ గా ఎన్నికయ్యారు. ఎన్ని కోట్ల రూపాయల నిధులను మీ గ్రామ ప్రగతికి వెచ్చించి ఉంటారో తెలుసుకోవచ్చా ?

స.మ: దాదాపుగా రూ.8 కోట్ల నిధులతో ప్రగతికి పాటుపడ్డాం. మరో కోటి సచివాలయ నిర్మాణానికి వెచ్చించాం.

మ.ప్ర.ప్ర: రూ.కోట్ల నిధులతో మీరు గ్రామ ప్రగతికి పాటుపడ్డానంటున్నారు. మరి ఈ క్రమంలో మీపై ఓ ఆరోపణైతే బలంగా వినిపిస్తోంది. డెవలప్ మెంట్ వర్క్స్ జరుగుతున్న నేపథ్యంలో మీరు సంబంధిత కాంట్రాక్టర్ల నుంచి పర్సెంటేజీలు దండుకున్నారంటారు. ఇది వాస్తవం కాదా ?

స.మ: ఎలాంటి కమీషన్లు తీసుకోలేదు. గ్రామ ప్రగతికి శ్రమించా. నాణ్యతతో కూడిన పనులు చేయమని అధికారులకు,కాంట్రాక్టర్లకు చెప్పాం. అది పూర్తిగా అవాస్తవం.

మ.ప్ర.ప్ర: మద్దిలేటి అనే వ్యక్తి స్థానికంగా ప్రజలకు అందుబాటులో ఉండరు, నిత్యం తన వ్యాపకాలు,వ్యాపారాలతో కర్నూలు నగరంలోనే ఉంటుంటారు అనే విమర్శ ఉంది. ఇది నిజం కాదంటారా ?

స.మ: మేమున్నది ప్రజల కోసం. నిత్యం ప్రజా సమస్యల పరిష్కారం కోసమే నేను కర్నూలుకు వెళ్తుంటాను. ప్రజలకు అధికారుల కార్యాలయాల్లో పనులు చేయించే నిమిత్తం నేను వెళ్లాల్సి వస్తుంది.



మ.ప్ర.ప్ర: గ్రామ ప్రగతికి మీ భవిష్యత్ కార్యాచరణ ఏ విధంగా ఉండబోతోంది ?

స.మ: మా గ్రామంలో పెద్దగా సమస్యలు లేవు. బి.సి.,ఓ.సి.లకు పెళ్లిళ్లు అయితే ఫంక్షన్ హాల్ లేదు. బి.సి.కమ్యూనిటి హాల్ కట్టించాల్సి ఉంది. మైనార్టీలకు షాదీఖానా లేదు. ఎస్సీ కమ్యూనిటి హాల్ పూర్తి చేయాల్సి ఉంది. యువత క్రీడా మైదానం కావాలని కోరుకుంటున్నారు. పర్వదినాలు వచ్చినప్పుడు క్రికెట్ పోటీలు నిర్వహిస్తుంటాం. గ్రామ పెద్దలు దాతలున్నారు. ఓ 4 ఎకరాల్లో క్రీడా మైదానం ఏర్పాటు చేయాలని చూస్తున్నాం.

మ.ప్ర.ప్ర: ప్రస్తుత రాజకీయాలపై మీ అభిప్రాయం ?

స.మ: ఓటర్లు విజ్నులు. ప్రజలకు అందుబాటులో ఉండే నాయకులనే వారు ఎన్నుకుంటారు. ప్రజల అవసరాలను, వారి కష్ట,నష్టాలను తీరిస్తే ప్రజలు ఎన్నిసార్లయినా పని చేసే వారినే తమ నేతగా ఎన్నుకుంటారు.

మ.ప్ర.ప్ర: మరోసారి మద్దిలేటి సర్పంచ్ ఎన్నికల బరిలో నిలిచే అవకాశముందా ?

స.మ: ప్రజలు కోరితే ముందుకొచ్చే అవకాశముంది.

## కర్నూలు నగరంలో వాల్మీకి విగ్రహం తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలి



మన గళం కోడుమూరు: కర్నూలు లో వాల్మీకి మహర్షి విగ్రహం తొలగించడం పట్ల కోడుమూరు తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు గంగాధర్ నాయుడు, మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో టిడిపి శ్రేణులు స్థానిక వాల్మీకి సంఘం నాయకులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు వాల్మీకి మహర్షి విగ్రహం తొలగించిన బి వై రామయ్య ఇటువంటి పని చేయకూడదని వాల్మీకై ఉండి వాల్మీకి విగ్రహాన్ని తొలగించడం ఎంతో బాధాకరమైన విషయమని రాబోయే కాలంలో అయినా ఇటువంటి పనులు చేయకూడదని వారు ఈ సందర్భంగా హెచ్చరించారు ఈ విషయం తెలుసుకున్న కె డి సి సి బి చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి తొలగించిన విగ్రహాన్ని యధావిధిగా అక్కడే ప్రతిష్టింపజేశారు. ఈ సందర్భంగా వాల్మీకులంతా విష్ణువర్ధన్ రెడ్డికి అభినందనలు తెలియజేశారు. ఈ విగ్రహం తొలగించడం పట్ల వాల్మీకుల మనోభావాలు దెబ్బతిన్నాయని ఈ విగ్రహం తొలగించిన వైయస్సార్ పార్టీ కర్నూలు మేయర్ బి వై రామయ్య పై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టే మధు, గోరంట్ల మధుసూదన్ నాయుడు, రవీంద్ర గౌడ్, వెంకటేశ్వర్లు, అయ్యప్ప, సురేష్, పురుషోత్తం రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## దెబ్బతిన్న ఉల్లి పంట ను ఎన్యూమరేషన్ చేయండి

– కర్నూలు జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి



మనగళం, కర్నూలు సిటీ : ఎర్లీ ఖరీఫ్ సీజన్ లో వర్షాల కారణంగా దెబ్బ తిన్న ఉల్లి పంట ను ఎన్యూమరేషన్ చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపిడిఓ లు, వ్యవసాయ అధికారులు, మండల స్పెషల్ అధికారులతో జిల్లా కలెక్టర్ విజయవాడ నుండి టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్యూమరేషన్ లో ఎలాంటి ఫిర్యాదులు రాకుండా జాగ్రత్తగా చేయాలన్నారు. మీరు పంపిన డేటాను వర్షపాత నివేదిక తో కో రిలేట్ చేసుకొని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని కలెక్టర్ తెలిపారు. అలాగే ఉల్లి పంట పక్వానికి రాక ముందే కోయకుండా, 110 రోజుల తర్వాత కోసి, తదుపరి బాగా ఆరబెట్టి, గ్రేడింగ్ చేసుకుని రైతుకు మార్కెట్ కు తీసుకొని వచ్చే విధంగా గ్రామ హార్టికల్చర్ అధికారి, గ్రామ వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. 110 రోజులు పంటను పండించకుండా, క్యూరింగ్ చేయకుండా రైతులు ఉల్లి పంటను మార్కెట్ కి తీసుకొని వస్తున్నారని, తద్వారా మంచి ధర రైతులకు రావడం లేదన్నారు. అలాగే టమాటాపై నల్ల నల్లగా మచ్చలు వస్తున్నాయని, దీంతో మంచి ధర రావడం లేదన్నారు. దీంతో ప్రతికూల వార్తలు వస్తున్నాయన్నారు.. మొక్కల సంరక్షణ చర్యలలో భాగంగా టమోటో పంట బాగా వచ్చే విధంగా చర్యలు తీసుకోవడంతో పాటు, టమోటో కి మంచి ధర వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జిల్లా హార్టికల్చర్ అధికారిని ఆదేశించారు. ఉల్లి పంట క్రాప్ బుకింగ్ శనివారం లోపు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ డా. బి.నవ్య మాట్లాడుతూ ఉల్లి పంట ఈ క్రాప్ బుకింగ్ 100 శాతం పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. టెలి కాన్ఫరెన్స్ లో డీ ఆర్ఓ వెంకట నారాయణమ్మ, జిల్లా పరిషత్ సీఈఓ నాసర రెడ్డి, హార్టికల్చర్ అధికారి రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా స్వర్ణరథోత్సవం



మనగళం శ్రీశైలం : ఆరుద్రా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఈ రోజు (16.09.2025) శ్రీస్వామిఅమ్మవార్లకు స్వర్ణరథోత్సవం నిర్వహించబడింది. కాగా ఆరుద్రోత్సవంలో భాగంగా ఈ రోజు వేకువజామున శ్రీస్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, విశేషపూజలు నిర్వహించబడ్డాయి. అనంతరం స్వర్ణరథోత్సవం జరిపించబడింది. ఈ స్వర్ణరథోత్సవంలో ముందుగా దేశం శాంతి సౌభాగ్యాలతో విలసిల్లాలని, అతివృష్టి అనావృష్టి నివారించబడాలని, ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి దేశం పాడిపంటలతో తులతూగాలని, జనులందరికీ ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాల మరణాలు రాకుండా ఉండాలని, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలంటూ ఆలయ అర్చకులు లోకకల్యాణానికాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. తరువాత రథారూఢులైన శ్రీస్వామిఅమ్మవార్లకు విశేషపూజలు జరిపించబడ్డాయి. అనంతరం భక్తుల శివనామస్మరణతో వేదమంత్రాల నడుమ ఉదయం గం.7.30లకు ఈ స్వర్ణరథోత్సవం ప్రారంభమైంది. గంగాధర మండపం నుంచి నందిమండపం వరకు తిరిగి అక్కడి నుండి నంది మండపం వరకు ఈ రథోత్సవాన్ని జరిపించడం జరిగింది. సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా రథోత్సవంలో పలు కళా బృందాల కోలాటం, డోలు వాయిద్యం మొదలైన జానపద కళారూపాలు కూడా ఏర్పాటు చేయబడ్డాయి. అదేవిధంగా రథోత్సవంలో సంప్రదాయ నృత్యం, నామసంకీర్తన (భజన) కూడా ఏర్పాటు చేయబడ్డాయి.. ఈనాటి స్వర్ణరథోత్సవంలో కార్యనిర్వహణాధికారి శ్రీ యం. శ్రీనివాసరావు, అర్చకస్వాములు, వేదపండితులు, పలువిభాగాల అధికారులు, పర్యవేక్షకులు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.





# నందీశ్వరస్వామికి విశేషపూజ



మనగళం శ్రీశైలం : లోక కల్యాణం కోసం దేవస్థానం ఈ రోజు (16.09.2025) ఆలయప్రాంగణంలోని నందీశ్వర స్వామికి (శనగల బసవన్న స్వామివారికి) విశేషార్చనలను నిర్వహించనున్నది. ప్రతి మంగళవారం మరియు త్రయోదశి రోజున దేవస్థానసేవగా (సర్కారీసేవగా) ఈ కైంకర్యం జరిపించబడుతోంది. ప్రదోషకాలంలో అనగా సాయంసంధ్యాసమయంలో ఈ విశేషపూజలు నిర్వహించడం జరుగుతోంది. ఈ విశేషార్చనలో ముందుగా లోకక్షేమాన్ని కాంక్షిస్తూ దేశం శాంతిసౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతి వైపరిత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని, పాడి సమృద్ధిగా ఉండాలని, జనులకు ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాలమరణాలు రాకుండా ఉండాలని, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, జనులందరూ సుఖశాంతులతో ఉండాలంటూ అర్చకస్వాములు, వేదపండితులు సంకల్పాన్ని చెప్పడం జరుగుతుంది. అనంతరం కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకుమహాగణపతిపూజను జరిపించబడుతుంది. ఆ తరువాత సందీశ్వరస్వామికి శాస్త్రోక్తంగా పంచామృతాలతోనూ, ఫలోదకాలతో హరిద్రోదకం, కుంకుమోదకం, గంధోదకం, భస్మోదకం, రుద్రాక్షోదకం, బిల్వోదకం, పుష్పోదకం, సువర్ణోదకం మరియు మల్లికాగుండంలోని శుద్ధజలంతో అభిషేకం నిర్వహిస్తారు. తరువాత నందీశ్వరస్వామికి అన్నాభిషేకం నిర్వహించబడుతుంది. వృషభసూక్తం మొదలైన వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా ఈ విశేషాభిషేకాన్ని చేయడం జరుగుతుంది. తరువాత నందీశ్వరస్వామివారికి నూతనవస్త్ర సమర్పణ, విశేషపుష్పార్చనలను చేస్తారు. అనంతరం నానబెట్టిన శనగలను నందీశ్వరస్వామికి సమర్పించడం జరుగుతుంది. చివరగా స్వామికి నివేదన సమర్పించబడుతుంది.

# గాలికుంటు వ్యాధి నిరోధక టీకా కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కోట్ల

మన గళంప్యాపిలి పట్టణ పశువైద్యశాలలో ఈరోజు మంగళవారం గాలికుంటు వ్యాధి నిరోధక టీకా కార్యక్రమాన్ని డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పశుసంవర్ధక రంగం రైతుల ఆర్థిక పరిస్థితి బలోపేతానికి ప్రధాన భూమిక వహిస్తుందని, పశువుల ఆరోగ్యం కాపాడేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. గాలికుంటు వ్యాధి నిర్మూలన కోసం ఈ టీకా కార్యక్రమం ఎంతో ప్రయోజనకరమని, ప్రతి రైతు తన పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించుకోవాలని



సూచించారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ



అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు నాయకులు,రైతులు పెద్ద పాల్గొన్నారు.

# డోన్ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం కావడం కన్నా 108 అంబులెన్స్ లో ప్రసవం కావడం మేలు అంటున్న గర్భిణీ స్త్రీలు

మన గళండోన్ డోన్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిలో చోటుచేసుకున్న తాజా ఘటన ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఒక గర్భిణి 108 అంబులెన్స్‌లోనే ఆడ బిడ్డకు జన్మనిచ్చిన ఘటన%ొా% అందులోనూ కనీస మౌలిక వసతులు లేకపోవడం%ొా% వైద్యం అవసరమై వచ్చిందో లేక ప్రమాదం ఎదుర్కొనేందుకో ఆసుపత్రికి వచ్చిందో అన్న సందేహాలను కలిగిస్తోంది. డోన్ ప్రభుత్వ ఆసుపత్రి గర్భిణుల రక్షణకు కాదు%ొా% రిస్క్‌కు నిలయంగా మారుతోందా అన్నదే ఇప్పుడు చర్చ. ఓ గర్భిణి పురిటి నొప్పులతో ఆసుపత్రికి చేరింది. వైద్యులు ఆమె పరిస్థితి గంభీరంగా ఉందని గుర్తించి, తక్షణమే కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేశారు. 108 అంబులెన్స్‌లో తరలింపు మొదలైంది%ొా% కానీ మార్గం మధ్యలోనే గర్భిణి స్త్రీ అంబులెన్స్‌లోనే ఆడబిడ్డకు జన్మనిచ్చింది. “ఆమెకు తీవ్రమైన నొప్పులు వచ్చాయి%ొా% ఆసుపత్రికి చేరకముందే పరిస్థితి చురుగ్గా మారింది. మేము ఎమర్జెన్సీ సహాయంతో ప్రసవం చేయాల్సి వచ్చింది. కానీ, వాహనంలో సదుపాయాలు చాలా అభాగ్యంగా ఉన్నాయి.ఇది ఒక్కసారి జరిగిన సంఘటన కాదు. డోన్ ఆసుపత్రిలో వైద్య సిబ్బంది కొరత, పరికరాలు పాడైపోవడం%ొా% ఎప్పటికప్పుడు రెఫర్ పేరుతో బయటకి పంపించడం సాధారణమైపోయింది. ఒక ప్రభుత్వ ఆసుపత్రి ఇలా పనిచేస్తే ప్రజలు ఎక్కడికి పోవాలి?” అని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆసుపత్రిలో డాక్టర్లు కరువైపోయారు%ొా% నర్సింగ్ సిబ్బంది తక్కువగా ఉంది. అత్యవసర సేవల కోసం వచ్చే రోగులకు అవస్థలు తప్పట్లేదు. తాజాగా చోటుచేసుకున్న ఈ ఘటన తర్వాత అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజల్లో నమ్మకబద్ధకం?ఒకవైపు ప్రభుత్వం మరోవైపు నిజంగా అవసరమైన వారికి కనీస వైద్యం కూడా అందకుండా పోతుండటం చర్చనీయాంశంగా మారింది. “డోన్ ఆసుపత్రిలో సిబ్బంది నియామకాలు చేయాలి. పరికరాలను పునరుద్ధరించాలి. అత్యవసర సేవల కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయాలి. లేదంటే ఇలాంటి ఘటనలు మళ్ళీ మళ్ళీ జరుగుతూనే ఉంటాయి.” అని ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.ట



ఓ ఆడబిడ్డ అంబులెన్స్‌లో జన్మించింది. అది సంతోషకరంగా అనిపించవచ్చు%ొా% కానీ ఆ వెంటనే వచ్చిన వాస్తవాలు కళ్లముందు గుబురుగొలిపేలా ఉన్నాయి. ప్రతి మాతృమూర్తికి సురక్షితమైన ప్రసవం అందించాలన్నది ప్రభుత్వ బాధ్యత%ొా% ఆ బాధ్యతలు నిర్వర్తించడంలో జరుగుతున్న విఫలతలు వెంటనే సరిదిద్దకపోతే%ొా% ఇది కేవలం వార్త కాదు%ొా% ఓ మానవీయ విషాదగాథగా మిగిలిపోతుంది.

# బుగ్గన అర్జున్ రెడ్డి ని దసరా నవరాత్రులకు ఆహ్వానించిన మున్సిపల్ వైస్ చైర్మన్ హరికిషన్

మన గళండోన్ డోన్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆఫీస్ %డ% డోన్ వైయస్సార్ నియోజకవర్గ అభ్యర్థి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తనయుడు బుగ్గన అర్జున్ అమర్నాథరెడ్డి ని డోన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు %డ% డోన్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కొత్రికే హరి కిషన్ బుగ్గన అర్జున్ అమర్నాథ్ రెడ్డి ని కలిసి దసరా నవరాత్రులకు శ్రీ కన్యకా పరమేశ్వరి దేవి ఆలయం అమ్మవారి శాల పూజ కార్యక్రమానికి విచ్చేయవలసిందిగా ఆహ్వానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వాణిజ్య విభాగ జాయింట్ సెక్రెటరీ పాలుట రఘురాం డోన్ అరవైశ్య సంఘం సెక్రటరీ మరియు డోన్ వాణిజ్య శాఖ అధ్యక్షులు మేడా రఘు ఆర్య వైశ్య సంఘం కోశాధికారి కొత్ర రజిని గ ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు కామిశెట్టి సాగర్ సెక్రటరీ ప్రదీప్ అరవైశ్య సంఘం మెంబర్స్ అల్వాల సురేష్ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.



# చిన్నమల్కాపురం గ్రామానికి చెందిన మధు కుమార్ కుటుంబానికి సీఎం సహాయ నిధి 10 లక్షలు ఆర్థిక సాయం అందించిన ఎమ్మెల్యే కోట్ల

మన గళండోన్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఈ రోజు డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి మల్కాపురం గ్రామానికి చెందిన మధు కుమార్ కుటుంబానికి సీఎం సహాయనిధి నుంచి ఆర్థిక సహాయం అందించారు. గత సంవత్సరం థాయ్‌లాండ్‌లోని బ్యాంకాక్‌లో కిడ్నాప్‌కు గురైన మధు కుమార్‌ను సురక్షితంగా విడిపించేందుకు ఎమ్మెల్యే వ్యక్తిగతంగా ముందడుగు వేసి, ఆ సమయంలో ఖర్చైన మొత్తం తిరిగి ఇవ్వనున్నట్లు హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఆ హామీని నిలబెట్టుకుంటూ, సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన ?10 లక్షల రూపాయల చెక్కును ఎమ్మెల్యే మధు కుమార్ కుటుంబ సభ్యుల చేతికి అందజేశారు.ఈ సందర్భంగా మధు కుమార్ కుటుంబ సభ్యులు మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న తమను ఆదుకున్నందుకు డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి కి మరియు ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సాయం తమ కుటుంబానికి ఎంతో ఉపశమనం కలిగించిందని, ఎల్లప్పుడూ మద్దతుగా నిలుస్తున్న నాయకులకు రుణపడి ఉంటామని పేర్కొన్నారు.



# రసం పీల్చే పురుగును జీడ ఉధృతిని వేప నూనె స్ప్రే ద్వారా తగ్గించవచ్చు

మన గళం కోడుమూరు: కోడుమూరు మండలంలోని వెంకటగిరి గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని ఉల్లి పంటలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కర్నూలు ఏడిఏ (ఇన్చార్జి ) %బా%. శ్రీ వర్ధన్ రెడ్డి, ఉద్యాన శాఖ అధికారి మదన్మోహన్ గౌడ్, మండల వ్యవసాయ అధికారి, ఆర్‌ఎస్కే సిబ్బంది, హిందూ, ప్రియాంక, గ్రామ రైతులు పాల్గొన్నారు. ఉల్లి పంటలో పై పాటుగా వేసే రసాయనిక ఎరువులకు బదులుగా నానో డిఏపీని ఎకరాకి 500 %ఎశ్రీ% స్ప్రే చేసుకోవడం వలన రైతుకు పంట దిగుబడి పెరుగుననీ, వేప నూనెను స్ప్రే చేయడం వలన (1500 %జూజూఎ% లేదా 3000 %జూజూఎ%) రసం బిల్చే పురుగును, జీడ ఉధృతిని తగ్గించవచ్చును. ఉల్లిలో చుట్ట తెగులు పండు తెగులు ఉన్నట్లయితే ట్యూబ్ కనెజోల్ ఎకరాకి 250 గ్రాములు స్ప్రే చేసుకోవాల్సిందిగా తెలిపారు. ఉల్లిలో పేను రసంబీంచే పురుగు గమనించినట్లయితే పిప్రో నిల్ ఎకరానికి 250 %ఎశ్రీ% స్ప్రే చేసుకోవాలని, మండలంలో ప్రతి రైతు కూడా మీ ఆర్ ఎస్ కే లో జరుగుతున్నటువంటి పంట నమోదును ఉపయోగించుకోవాల్సిందిగా వెల్లడించారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు ఆర్‌ఎస్కే సిబ్బంది స్థానిక రైతులు పాల్గొన్నారు



# సీనియర్ న్యాయవాది శ్రీ ఎన్ నరసింహుడు కుమార్తె ఎన్ సాహితి మూట్ కోర్ట్ ఫలి తాల్లోజాతీయస్థాయిలో రాణింపు

- లా కమిషన్ ఆఫ్ ఇండియా హానరబుల్ చైర్పర్సన్ జస్టిస్ దినేష్ మహేశ్వరి తో అవార్డు అందజేతలి
- ఆనందం వ్యక్తం చేసిన తల్లి తండ్రులులి
- హర్షం వ్యక్తం చేసిన డోన్ బార్ అసోసియేషన్ మరియు న్యాయవాదులులి






మన గళండోన్ జాతీయస్థాయిలో నిర్వహించిన మూట్ కోర్ట్ ఫలి తాల్లో డోన్ కు చెందిన సీనియర్ న్యాయవాది శ్రీ ఎన్. నరసింహుడు,శ్రీమతి ఎన్. లావణ్య గార్ల కుమార్తె తిరుపతి అంబేద్కర్ గ్లోబల్ న్యాయ కళాశాల లో లా విద్యను అభ్యసిస్తుంది.ఈ కళాశాల నుంచి మొదటి రన్నరప్ ఫ్రై జ్ తో పాటు క్యాష్ అవార్డు ను లా కమిషన్ ఆఫ్ ఇండియా హానరబుల్ చైర్పర్సన్ జస్టిస్ దినేష్ మహేశ్వరి, ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి ఎమ్మెస్ జస్టిస్ జ్యోతిసింగ్ మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విజయకుమార్ శుక్ల చేతులమీదుగా గుజరాత్ లో మా కూతురు ఎన్. సాహితి అవార్డు అందుకోవడం చాలా ఆనందంగా ఉందని వారు సంతోషాన్ని వ్యక్తం చేశారు. గుజరాత్ లోని పరుల్ యూనివ ర్శిటీ సంవిధాన్ పే చర్చా-2025లో 110 విశ్వ విద్యాలయాలు పాల్గొన్నాయని, ఈ పోటీల్లో తోటి న్యాయవాది నరసింహుడు కుమార్తె. ఎన్ సాహితి.పాల్గొని రన్నరప్ ఫ్రై జ్ తో పాటు క్యాష్ అవార్డు ను కైవసం చేసుకున్నందుకు న్యాయవాదులు డోన్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు శీలం భాస్కర్ నాయుడు, ప్రధాన కార్యదర్శి ఏన్ మద్దయ్య, సీనియర్ న్యాయ వాదులు హరి మురళీధర్ రావ్, కోట్ల హరి చంద్రారెడ్డి, ఏం. నాగభూషణం రెడ్డి, కానాల మహేష్,ఇ. వేణుగోపాల్ గౌడ్, ఆంజనేయులు గౌడ్, ఎస్టీ హరుణ్,రామలింగయ్య,మద్దిలేటి,మరియు డోన్ బార్ అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

# ఓజోన్ పొర సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత




మన గళం బనగానపల్లె : బనగానపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ ఓజోన్ పొర సంరక్షణ దినోత్సవంను కళాశాల ప్రిన్సిపాల్ డా ఎస్ లలిత అధ్యక్షతలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కోవెలకుంట్ల ఎస్ వి బి డిగ్రీ కళాశాలలో రసాయనిక శాస్త్ర అధ్యాపకురాలు అన్నపూర్ణ పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రిన్సిపల్ లలిత మాట్లాడుతూ ఓజోన్ పొర అనేది భూమి మీద జీవరాశులను సూర్యుని హానికర అల్ట్రావయొలెట్ కిరణాల నుండి రక్షించే సహజ కవచం. ఈ పొరను సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత. పర్యావరణానికి మేలు చేసే జీవన శైలిని అవలంబించడం ద్వారా ఓజోన్ పొర రక్షణ సాధ్యమవుతుంది అని ఆమె పేర్కొన్నారు.అనంతరం ముఖ్యఅతిథిగా పాల్గొన్న అధ్యాపకురాలు అన్నపూర్ణ ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ 1987లో కుదిరిన మాంట్రియల్ ప్రోటోకాల్ ద్వారా ప్రపంచ దేశాలు ఓజోన్ పొరను కాపాడటానికి కృషి చేశాయి. ప్రస్తుతం ఓజోన్ పొర మళ్లీ పునరుద్ధరించబడుతోందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. విద్యార్థులు పర్యావరణ పరిరక్షణలో ముందుండాలి అని పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా అధ్యాపకుడు డా. జె. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ఓజోన్ పొర భవిష్యత్ తరాలకు సహజ రక్షణ కవచం. కాలుష్య నియంత్రణ, చెట్లు నాటడం, పర్యావరణానికి హాని చేసే ఉత్పత్తులను ఉపయోగించకపోవడం ద్వారా విద్యార్థులు ఓజోన్ పొర రక్షణలో కీలక పాత్ర పోషించాలి అన్నారు. ఎన్. ఉమామహేశ్వరరెడ్డి భౌతికశాస్త్ర ఉపన్యాసకులు మాట్లాడుతూ మాంట్రియల్ ప్రోటోకాల్ను అన్ని దేశాలు సమర్థవంతంగా అమలు చేస్తున్నందువల్ల 2060 నాటికి ఓజోన్ పొర పూర్తిగా పూర్వస్థితికి వస్తుందని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. ఇది ప్రపంచవ్యాప్తంగా సహకారానికి గొప్ప ఉదాహరణ అని వివరించారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో డి.వి. రవికుమార్ అధ్యాపకులు డా. కె. బడేసాహెబ్, డా. కె. రామకృష్ణ, డా. ఎస్.ఎం.డి. గౌస్, డా. జె. వసుంధరమ్మ, ఎ. కౌశల్యాదేవి, డా. నాగతిమ్మయ్య, సి. వరలక్ష్మి మరియు అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో పోటీ చేయడానికి సిద్ధం కావాలి పిలుపునిచ్చిన బిజెపి శ్రేణులు



మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు పట్టణంలోని స్థానిక చెన్నకేశవ స్వామి దేవాలయంలో మండల స్థాయి బిజెపి ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించడం అయినది. ఈ కార్యక్రమానికి మండల అధ్యక్షులు కప్పట్రాళ్ల మహేష్ నాయుడు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి గొందిపర్లే మాలతి జిల్లా ప్రధాన కార్యదర్శి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి నాయకులు రానున్న స్థానిక ఎన్నికలకు ప్రణాళిక బద్ధంగా సిద్ధం కావాలని మండలంలోని ప్రత్యేక స్థానాలను గుర్తించి ఆ స్థానాలలో గెలుపు కెరటాన్ని ఎగిరేసే విధంగా ముందుకెళ్లాలని వారు సూచించారు. పట్టణంలో బిజెపి గెలుపు స్పష్టంగా కనిపిస్తుంది కాబట్టి కష్టపడి ఈసారి కోడుమూరు మేజర్ గ్రామపంచాయతీ స్థానాన్ని బిజెపి కైవసం చేసుకోవాలని వారు సూచించారు. అలాగే నరేంద్ర మోడీ జన్మదిన సందర్భంగా ఈనెల 17 నుండి అక్టోబర్ 2వ తేదీ వరకు జరగనున్న సేవ పక్వాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వల్మూర్ నరేష్ మాజీ మండల అధ్యక్షులు సాలువాడి సురేంద్ర మండల ఉపాధ్యక్షులు కోనప్ప సాయి శీను బిజెపి సీనియర్ నాయకులు కృష్ణ కొత్తూరు దస్తగిరి పాలకుర్తి సోమన్న హనుమంతు రమేష్ ఓబులేష్ గోరంట్ల గడ్డ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# ఆదోని మెడికల్ కళాశాలను.... బినామీలకు అప్పగించేందుకు కుట్ర

- వైద్య రంగాన్ని భ్రష్టపట్టిస్తున్నకూటమి సర్కార్
- పబ్లిక్- ప్రైవేట్- పార్టనర్ షిప్ ను అడ్డుకుంటాం
- వైసీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి





మనగళం, ఆదోని : కూటమి సర్కార్ వైద్యరంగాన్ని భ్రష్టుస్తుందని, పేదలకు వైద్య విద్యను దూరం చేస్తుందని వైసీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి, కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి ధ్వజమెత్తారు. ఆదోని మెడికల్ కళాశాలను కూటమి పెద్దలు బినామీలకు అప్పగించేందుకు కుట్రలు పన్నుతున్నారని, అడ్డుకుంటామని హెచ్చరించారు. ఆదోని మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూధన్, కోడుమూరు ఇంచార్జ్ అధిమూలపు సతీష్, రాష్ట్ర పార్లమెంట్ కార్యదర్శి %ౡ% జగన్ మోహన్ రెడ్డి, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు బుట్టా ప్రతుల్, రాష్ట్ర మహిళా కార్యదర్శి శశికల తదితర నాయకులతో కలిసి ఎస్వీ మోహన్ రెడ్డి మంగళవారం ఆదోనిలోని మెడికల్ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్వీ మోహన్ రెడ్డి మాట్లాడుతూ కర్నూలు జిల్లాలోని ఆదోని పట్టణం దశాబ్దాలుగా వైద్య సేవలకు దూరంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 2021లోనే ఈ ప్రాజెక్టును ఆమోదించి, రూ. 475 కోట్ల వ్యయంతో మెడికల్ కళాశాలను ప్రారంభించారని గుర్తు చేశారు. 430 పడకలతో కూడిన బోధనాస్పత్రి, ఆధునిక హాస్టల్స్, లిక్విడ్ ఆక్సిజన్ ప్లాంట్, సెంట్రల్ కిచెన్, లాండ్రీ, మోర్చరీ వంటి అత్యాధునిక సదుపాయాలు ఇక్కడ నిర్మాణంలో ఉన్నాయన్నారు. ఇది కేవలం మెడికల్ కళాశాల మాత్రమే కాకుండా, మొత్తం ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం, పత్తి కొండ, మాన్వి, అలూరు, మడికేరి వరకు ప్రజలకు మెడికల్ హబ్గా మారబోతోందన్నారు. ఈ మెడికల్ కళాశాల పూర్తయితే ఆదోనికి శాశ్వత అభివృద్ధి ద్వారం తెరుచుకుంటుంది. శతాధిక సంఖ్యలో డాక్టర్లు, వందలాది నర్సులు, వందలాది విద్యార్థులు ఇక్కడ చేరతారు. ఈ ప్రాంత యువతకు ఉద్యోగాలు, వ్యాపార అవకాశాలు పెరుగుతాయి. ఆదోని రైల్వే, బస్సు సౌకర్యాలు మరింత విస్తరిస్తాయి. విద్య, ఆరోగ్య రంగాలలో ఆదోని మొత్తం రాయలసీమకు ఆదర్శంగా నిలుస్తుందని చెప్పారు. అయితే, ఈ ప్రజల కలను వమ్ము చేసేందుకు చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ కుట్ర మొదలుపెట్టిందని విమర్శించారు. ఆదోని మెడికల్ కళాశాలను పబ్లిక్ - ప్రైవేట్ - పార్టనర్ షిప్ పేరిట బినామీలకు అప్పగించే ప్రయత్నం జరుగుతోందని, కూటమి కుట్రలను తిప్పికొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఆదోని పట్టణ ప్రజల ఆశలపై నీళ్లు చల్లితే సహించమని, కూటమి కుట్రను వైసీపీ శక్తివంచన లేకుండా పోరాటం చేస్తుందని హెచ్చరించారు.

# పత్తి రైతులకు సంపూర్ణ సహకారం

- సురక్షితమైన వ్యవసాయ పద్ధతులను పాటించాలి
- జాయింట్ కలెక్టర్ డా. బి.నవ్య




మనగళం, కోడుమూరు : పత్తి రైతులకి అని రకాల సహాయ సహకారాలు అందిస్తున్నామని జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య తెలిపారు. మంగళవారం కోడుమూరులో శ్రీ వాసవీ కళ్యాణ పరమేశ్వరి మండపంలో పత్తి రైతులకు పిచికారీపై శిక్షణ, సబ్సిడీ పై పరికరాలను పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ మరి సంస్థల ప్రతినిధులు పత్తి రైతులకు ఎంతో సహాయ, సహకారాలు అందిస్తున్నారన్నారు. పీపీఈ కిట్లు, ఏప్రాన్, పత్తిని నిల్వ చేసుకునేందుకు బ్యాగ్ లు అందించడం అభినందనీయమన్నారు. అదే విధంగా రైతులను లెర్నింగ్ గ్రూప్ ల కింద ఏర్పాటు చేసి వారికి ఎప్పటికపుడు శిక్షణ తరగతులను నిర్వహించి పత్తి రైతులకు అని రకాల సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారని గుర్తు చేశారు. రైతులు క్రిమిసంహారక మందులు అవసరం మించి వినియోగిస్తున్నారని, ఎంత మోతాదులో వాడాలి అనే విషయాలపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. పీపీఈ కిట్స్, టోపీ, షర్టు, ఏప్రాన్, పికింగ్ బ్యాగులు తదితర రక్షణ వస్తువులను పంపిణీ చేసారు. ముందుగా కోడుమూరు మండలం ప్యాలకుర్తి గ్రామంలోని బెటర్ కాటన్ ప్రాజెక్ట్ లో భాగంగా రైతు వెంకన్న పొలాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ సందర్శించారు. గ్రామ రైతులతో మాట్లాడిన జేసీ అంతరపంట, సరిహద్దు పంటగా సాగు చేసిన సజ్జను పరిశీలించారు. పురుగుల ఉధృతి తెలుసుకోవడం కోసం ఏర్పాటు చేసిన లింగాకర్షక బుట్టలు, జిగురు అట్టలు, పంట పరిస్థితి, కాయల లక్షణాలు, పత్తి పింజ నాణ్యత మొదలైన అంశాలను జాయింట్ కలెక్టర్ సమీక్షించారు. అలాగే రైతులతో దిగుబడి స్థితిపై వివరంగా చర్చించారు. సుస్థిర పద్ధతులు వాడడం వలన పురుగుమందుల వాడకం తగ్గించామని, పెట్టుబడి ఖర్చు కూడా తగ్గిందని రైతులు జేసీకి తెలిపారు. కార్యక్రమంలో నాబార్డ్ డీడీఎం సుబ్బారెడ్డి, ఎల్డీఎం రామచంద్ర రావు, వ్యవసాయ అధికారి వరలక్ష్మి, కేవీకే %-% బణవాసి ప్రముఖ సమన్వయకర్త డా. కె. రాఘవేంద్ర చౌదరి, మారి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మురళీ రామిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికుల హక్కుల పరిరక్షణే లక్ష్యం




మనగళం, కర్నూలు సిటీ : ఆర్టీసీ కార్మికుల హక్కుల పరిరక్షణే లక్ష్యంగా ప్రైవేటీకరణ చర్యలను ప్రతిఘటిస్తామని ఎస్ డబ్ల్యూ ఎఫ్ రాష్ట్ర కోశాధికారి జె .దివాకర్ పేర్కొన్నారు. పీటీడీ (ఆర్టీసీ) స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్(ఎస్ డబ్ల్యూ ఎఫ్) 47వ వ్యవస్థాపక దినోత్సవ సభ కర్నూలు లోని కార్మిక కర్షక భవన్లో రీజినల్ నాయకులు వీఎస్. రాయుడు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ బస్సుల పేరుతో ఆర్టీసీలో ప్రైవేటీకరణ చర్యలను వేగవంతం అయ్యాయని, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా నిర్ణయాలు చేయడాన్ని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ వ్యతిరేకిస్తుందని తెలియజేశారు. విద్యుత్ బస్సుల నిర్వహణ మొత్తాన్ని ఆర్టీసీకే అప్పజెప్పాలని, కొత్త బస్సులను కొనుగోలు చేసి, సిబ్బందిని రిక్రూట్ చేసుకొని స్త్రీ శక్తి బస్సులలో వస్తున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.డి. అంజి బాబు మాట్లాడుతూ ఎస్ డబ్ల్యుఎఫ్ ఆవిర్భావ శుభాకాంక్షలు తెలియజేశారు. ఆర్టీసీ కార్మికుల పోరాటాలకు ఎల్లప్పుడూ సీఐటీయూ అండదండగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ డబ్ల్యు ఎఫ్ రీజినల్ నాయకులు ఎస్. ఆర్. కే .రెడ్డి, కర్నూలు1 డిపో కార్యదర్శి బి. నాగరాజు, కర్నూలు 2 డిపో కార్యదర్శి బజారి, నాయకులు, ఎస్ ఏ సలాం, ఆర్. ఎల్. నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# డిప్లొమా కోర్సులకు దరఖాస్తు చేసుకోండి

మనగళం, కర్నూలు సిటీ : డిప్లొమా ఇన్ అనస్థీషియా టెక్నీషియన్,మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్, కార్డియాలజీ, ఇ.సి.జి, ఖ్యాత్ ల్యాబ్, డయాలిసిస్, మెడికల్ ఇమేజింగ్ టెక్నీషియన్, రేడియో గ్రాఫిక్, ఆఫ్తాల్మిక్, డార్క్ రూం అసిస్టెంట్ కోర్సులకు దరఖాస్తు చేసుకునేందుకు దరఖాస్తులను స్వీకరిస్తున్నామని అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ %ఒ% కర్నూల్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ నరసమ్మ మంగళవారము ఒక ప్రకటన లో తెలిపారు. ఈ నెల 27 వరకు గడువు వుందని, పూర్తి చేసిన దరఖాస్తులను కర్నూల్ మెడికల్ కాలేజీ యందు రూ.100 చెల్లించి అందచేయాలన్నారు. అక్టోబర్ 10 వ తేదీ కౌన్సెలింగ్ ఉంటుంది అని తెలిపారు.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

8తరువాయి భాగాము

# నిత్య..సేవకుడే





నుంచి రూ.20 వేల క్యాష్ రివార్డును తాను అందుకున్నారు. అంతే కాదు..పలు కమెండేషన్ సర్టిఫికెట్లు సైతం తనకు అంది వచ్చాయి.

ఫ్రెండ్లీ...పోలీస్ : తాను కర్నూలు వన్ టౌన్ పోలీస్ స్టేషన్ సి.ఐ.గా వచ్చి కేవలం నెల రోజులే అయ్యింది. అయినా..తాను వచ్చీ రాగానే స్టేషన్ పరిధిపై ఓ విజన్ ను తాను రూపొందించుకున్నారు. అసలే ఇరుకు రోడ్లతో సతమతమయ్యే పాతబస్తీలో వాహనాల పార్కింగ్ సమస్యలను క్రమబద్దీకరించే పనిలో నిమగ్నులయ్యారు. ఆ దిశగా సఫలీక్రుతులయ్యారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ లో భాగంగా వన్ టౌన్ పి.ఎస్.లో ప్రత్యేకంగా హెల్ప్ డెస్క్ ను ఏర్పటు చేసి, అందులో సిబ్బందిని అనునిత్యం ఉండేలా చూసి, స్టేషన్ కు వచ్చే బాధితుల కు సత్వర సేవలంది వచ్చేలా చూడగలిగారు. ఎవ్వరైనా సమస్యలతో స్టేషన్ కు వచ్చే బాధితులు నేరుగా తనను కలిసేలా వీలు కల్పించి, తానో ఫ్రెండ్లీ పోలీస్ నని చెప్పకనే...చెప్పారు. శాంతి,భద్రతల పరిరక్షణలో భాగంగా నిత్యం గస్తీ ఉండేలా చూసి, సిబ్బందిని విధుల్లో అలసత్వం వహించనీక,పర్యవేక్షిస్తూ...వన్ టౌన్ పరిధిలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరుగకుండా..అప్రమత్తుడై వ్యవహరిస్తూ, స్థానిక ప్రజల ప్రశంసలకు తాను పాత్రుడవుతూ,అందరి పాలిట ఆపద్భాంధవుడయ్యాడు.

శాఖలో..ప్రవేశం..అనూహ్యమే : తాను తన తల్లి,దండ్రుల ఆకాంక్ష మేరకు ప్రభుత్వ ఉద్యోగాన్ని పొందాలని ఆశించాడు. అయితే..పోలీసు శాఖలో ప్రవేశించాలని అయితే...అనుకోలేదు. కానీ, పోటీ పరీక్షలకు ప్రిపేరవుతున్న నేపధ్యంలో అనుకోకుండా ఆ ఎస్సై పరీక్ష రాశారు, ఎంపికయ్యారు.

స్ఫూర్తి-ఆదర్శం : ఇంకెవ్వరు...? తన చిన్నాన్న మాధవయ్య. 1970 ప్రాంతంలోనే తన చిన్నాన్న జిల్లా ఉపాధి కల్పనాధికారిగా పని చేశారు. తమ వంశంలో అప్పట్లో ఆయనే ఓ పెద్ద ప్రభుత్వ అధికారి. తనను చూసి, తాను సైతం ఓ మంచి ప్రభుత్వోద్యోగం సాధించి, జీవితాన స్థిరపడాలని ఆయన ఆశించారు. శ్రమించి, తన లక్ష్యాన్ని ఆయన చేరుకోగలిగారు.

బెస్ట్ ఫ్రెండ్స్ : తాను అందరితోనూ కలుపుగోలుగా ఉంటుంటారు. అయినప్పటికీ...రాయదుర్గంలో ఉండే ప్రభుత్వ ఉపాధ్యాయుడు రామేశ్వర రెడ్డి, గుంటూరు,మదనపల్లిల్లో సి.ఐ.లుగా పని చేస్తున్న శోభన్ బాబు,ఎలిషావలి..తనకు హితులు,సన్నిహితులు.

సినిమాలు : చూస్తుంటారు. అయితే...తక్కువే.

న(మె)చ్చిన..నటీ,నటులు :తనకు మెగాస్టార్ చిరంజీవి అంటే చాలా ఇష్టం.

బెస్ట్...ఆఫీసర్స్ : పోలీసు శాఖలో సజ్జనార్,సీతారామాంజనేయులు,కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, టౌన్ డిఎస్పీ జె.బాబు ప్రసాద్.

న(మె)చ్చిన...నేతలు : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్

అదనపు...ఎస్పీ...దాకా : తనకు ఇంకా సర్వీస్ ఉన్న నేపధ్యంలో తన పదవీ విరమణ కాలం నాటికి...అదనపు ఎస్పీ..స్థాయిని చేరుకునే వీలుంది.

ట్రూ...పోలీస్ : నీతిగా,నిజాయితీగా పలు సమస్యలపై పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితుల సమస్యలను ఓర్పుగా విని, తగిన పరిష్కార మార్గాన్ని చూపగలగాలి. మొదట స్టేషన్ కు వచ్చే బాధితులకు ఓదార్పునివ్వాలి,ఆనక వారి సమస్యను పరిష్కరించి,స్వాంతన చేకూర్చే వారందరూ...నిజమైన పోలీసులే.

యువతకు..సందేశం : స్థిరమైన లక్ష్యాలను నిర్ణయించుకుని, వాటి సాధనకు కఠోర సాధన చేసి, లక్ష్యాలను సాధించాలి. దుర్వ్యసనాలకు దూరంగా ఉండాలి. పెద్దలను గౌరవించాలి, సమాజ సేవలో తాము భాగస్వాములవ్వాలి,సాంకేతిక పరిజ్ఞానాన్ని సవ్య దిశన, అంటే అర్థవంతమైన రీతిలో సద్వినియోగం చేసుకోవాలంటూ..సూచిస్తున్న తాను యువతకు నిస్సందేహంగా...ఓ..మార్గదర్శి, ఓ దిశా నిర్దేశకుడే.



నిరంతర..సేవకుడే : తనను అవసరార్థులెవరైనా వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో నేరుగా కలువవచ్చని ఆయన చెబుతుంటారు. అలా వీలు కాని పక్షంలో తన మొబైల్ నెంబర్ : 91211 01159 లో నైనా...అర్ధరాత్రయినా, అపరాత్రయినా సంప్రదించి, తగిన సలహాలు,సూచనలు,చేయూతను పొందవచ్చంటోన్న తాను...ఓ..సేవాతత్పరుడే.

మహిళాభ్యుదయవాది,రైతు పక్షపాతి : అకాశంలో సగం,అన్నింటా సమమనే రీతిన మహిళలు అన్ని రంగాల్లో అద్భుతాలు స్రుష్టిస్తోన్న ఈ తరుణంలో మహిళలు ఉన్నత విద్యలను అభ్యసించి, ఉపాధి,ఉద్యోగావకాశాలను అంది పుచ్చుకోవాలని, తద్వారా..ఆర్థిక స్వావలంబనను సాధించాలని సూచిస్తోన్న తాను...ఓ మహిళాభ్యుదయవాదే. అంతేనా..? ఆరుగాలం శ్రమించి,స్వేదం చిందించే అన్నదాతలు పంటలు పండక, పండినా తగిన గిట్టుబాటు ధరలు లేక, వగచి,బలవన్మరణాలకు పాల్పడి, అయిన వారిని అనాధలుగ చేయరాదని రైతన్నలకు సూచిస్తోన్న..తాను...రైతు పక్షపాతి.

జీవితాశయం : పదుగురికి సాయం చేసే శాఖలో అవకాశమొచ్చింది. అంది వచ్చిన ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ, బాధితులకు సత్వర స్వాంతననిస్తూ, వారి సమస్యలను వెనువెంటనే పరిష్కరిస్తూ...ఓ మంచి పోలీసు అధికారిగా...నలుగురి నోటా నానడమే...తన..జీవితాశయమంటోన్న..ఆయన...ఓ...మానవతావాది.

## సెప్టెంబర్ 18, 19 వ తేదీలలో కర్నూలు మార్కెట్ యార్డ్ కు సెలవు

**- జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య**

మనగళం, కర్నూలు సిటీ : సెప్టెంబర్ 18 వ, 19 వ తేదీలలో కర్నూల్ మార్కెట్ యార్డ్ కు సెలవు ప్రకటించామని జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య తెలిపారు.17 వ తేదీన మార్కెట్ యార్డ్ కు ఉల్లి పంట ఎక్కువ వచ్చే అవకాశం ఉన్నందున, మార్కెట్ యార్డ్ పూర్తి గా నిండిపోయినందున, నిలువ ఉన్న ఉల్లి ను ట్రేడింగ్ మరియు బహిరంగ వేలం ద్వారా బయటికి తరలించడానికి, రైతులకు ఇబ్బంది లేకుండా సెలవు ప్రకటించడం జరిగిందన్నారు. అలాగే ఆ తేదీలలో ఎమ్మిగనూరు మార్కెట్ యార్డ్ లో ఉల్లి క్రయ విక్రయాలు జరుగుతాయని జేసీ వివరించారు. రైతులు ఈ విషయాన్ని గమనించి ఉల్లిని 18, 19 తేదీలలో కర్నూలు మార్కెట్ యార్డ్ కు తీసుకొని రాకుండా ఎమ్మిగనూరు మార్కెట్ యార్డ్ కు తీసుకెళ్లాలని జేసీ సూచించారు. 18, 19 వ తేదీలలో కర్నూలు మార్కెట్ యార్డ్ లో ఉల్లి బహిరంగ వేలం నిర్వహిస్తామని, రిటైలర్స్, హోల్సేలర్స్, హోటల్స్ యాజమాన్యాలు తదితరులు పాల్గొనాలని జాయింట్ కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. రైతులు ఉల్లి పంట కోతకు వచ్చేవరకు అనగా నాటినప్పటి నుంచి 100 నుండి 120 రోజులవరకు పొలంలో ఉంచి పక్వానికి వచ్చిన తర్వాత మాత్రమే కోయాలని జేసీ సూచించారు. ఉల్లి పంటకు సరైన ధర లేకపోవడం వలన రైతుల నష్ట పోకూడదని ఉద్దేశంతో ప్రభుత్వం మద్దతు ధర రూ.1,200 క్వింటా కు నిర్ణయించిందన్నారు. ట్రేడర్స్ కొనుగోలు చేసిన తరవాత మిగిలిన ఉల్లి ని మార్క్ ఫెడ్ ద్వారా 31.08.2025 నుండి కర్నూలు మార్కెట్ యార్డ్ నందు కొనుగోలు చేయడం ప్రారంభించామన్నారు. ట్రేడర్స్ కొన్న ధరకు మద్దతు ధరకు ఉన్న వ్యత్యాసపు ధరను ప్రభుత్వం రైతులకు జమచేయ్యడం జరుగుతుందన్నారు. ట్రేడర్స్ కొనని ఉల్లిని ప్రభుత్వం మార్క్ ఫెడ్ ద్వారా రూ.1200 క్వింటా కి కొనుగోలు చేస్తుందన్నారు. ఇప్పటి వరకు రైతుల నుండి దాదాపుగా 6,000 టన్నుల ఉల్లిని రైతులు నష్టపోకూడదని ఉద్దేశంతో క్వింటాలకు రూ 1,200 చొప్పున చెల్లించి కర్నూలు మార్కెట్ యార్డ్ నందు కొనుగోలు చేస్తూ ఇతర జిల్లాల రైతు బజార్లకు, ఇతర జిల్లాల మార్కెట్లకు, పౌరసరఫరాలకు సరఫరా చేస్తున్నామన్నారు

## బయలు వీరభద్రస్వామికి ప్రదోషకాల అభిషేకం

మనగళం శ్రీశైలం : లోకకల్యాణం కోసం దేవస్థానం ఈ రోజు (16.09.2025) సాయంకాలం శ్రీశైలక్షేత్ర పాలకుడైన శ్రీబయలు వీరభద్రస్వామివారికి విశేషపూజలను జరిపించనున్నది. ప్రతీ మంగళవారం మరియు అమావాస్యరోజులలో బయలువీరభద్రస్వామివారికి ఈ విశేష అభిషేకం, అర్చనలను నిర్వహించబడుతున్నాయి. బయలు వీరభద్రస్వామివారు శివభక్తగణాలకు అధిపతి. అదేవిధంగా శ్రీశైలక్షేత్రపాలకుడుగా క్షేత్రానికి ఆరుబయట ఉండి, ఎటువంటి ఆచ్ఛాదన, ఆలయం లేకుండగా బయలుగా దర్శనమిస్తాడు కనుక ఆయనకు బయలువీరభద్రస్వామి అని పేరు వచ్చింది. ప్రసన్నవదనంతో కిరీట మకుటాన్ని కలిగి దశభుజుడైన స్వామివారు పది చేతులలో వివిధ ఆయుధాలతో దర్శనమిస్తాడు. స్వామివారికి క్రిందివైపున కుడివైపు దక్షుడు, ఎడమవైపు భద్రకాళి దర్శనమిస్తారు. ఈ స్వామిని దర్శించినంత మాత్రానే ఎంతటి క్లిష్ట సమస్యలైనా తొలగిపోతాయని, వ్యాధులు నశించి ఆయురారోగ్యాలు చేకూరుతాయని ప్రసిద్ధి. ముఖ్యంగా ఆగమసంప్రదాయంలో క్షేత్రపాలక పూజకు చాలా విశేషస్థానం ఉంది. క్షేత్ర పాలకుడికి పూజలు చేయడం వలన ఆ క్షేత్రంలో ఉన్నటువంటి భక్తులు ఎటువంటి భయం, బాధలు లేకుండా సుఖసంతోషాలతో ఉంటారు. మంగళవారం, ఆదివారం మరియు అమావాస్య రోజులలో చేసే వీరభద్రపూజ అనేక ఫలితాలు ఇస్తుందని ఆగమశాస్త్రాలు చెబుతున్నాయి. ఈ స్వామిపూజతో సకలగ్రహ అరిష్టదోషాలు, దుష్టగ్రహపీడలు తొలగిపోతాయి. అదేవిధంగా సంతానం, ఐశ్వర్యం మొదలైన



అనేక శుభఫలితాలు చేకూరుతాయి. ఈ పూజాదికాలలో పంచామృతాలతోనూ, బిల్వోదకం, కుంకుమోదకం, హరిద్రోదకం, భస్మోదకం, గంధోదకం, పుష్పోదకం, శుద్ధజలాలతో స్వామివారికి అభిషేకం నిర్వహించడం జరుగుతుంది.

## హిందుత్వమంటే... ఆత్మ విజ్ఞాన మార్గం



మనగళం, కర్నూలు సిటీ : హిందుత్వమంటే ఆత్మ విజ్ఞాన మార్గమని, శాశ్వతమైన ఆనందాన్ని కలిగించేది ఆత్మవిజ్ఞాన మార్గమేనని, భారతదేశానికి శాశ్వతమైన కీర్తి తెచ్చిపెట్టినది ఇదియేనని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూధర్మ ప్రచారపరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లాశాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో సాయిబాబా మందిరం నందు నాలుగు రోజుల ధార్మిక కార్యక్రమాల ప్రారంభ సందర్భంగా ఆయన ప్రారంభోపన్యాసం చేశారు. తదనంతరం జి. బలరామాచార్య చేసిన ధార్మిక ప్రవచనం భక్తులను ఎంతగానో అలరించినది. ఈ కార్యక్రమంలో గణేష్ ధార్మిక సంఘం అధ్యక్షులు ఈపూరి ఓంకారమయ్య, కార్యదర్శి మాకా రాజశేఖర్, కోశాధికారి చింతా వెంకట శేషయ్య, అర్చకులు ఎం. నరసింహయ్య, శేషస్వామి, తితిదే ధర్మ ప్రచారమండలి సభ్యులు ఎ. శివశంకర రెడ్డితో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి





మనగళం, ఎమ్మిగనూరు : ఎమ్మిగనూరు పట్టణంలో ఉన్నటువంటి ప్రైవేట్ పాఠశాలలు దోపిడీని అరికట్టాలని, అదేవిధంగా పాఠశాలకు వత్తాసు పలుకుతున్న ఎమ్మిగనూరు ఎంఈఓ ను సస్పెండ్ చేయాలని మంగళవారం కర్నూలు డీఈఓకు ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు ఉదయ్, శేఖర్,ఆఫ్రిద్, ఖాజా,రఘునాథ్ మాట్లాడుతూ ఎమ్మిగనూరు పట్టణంలో ఉన్నటువంటి చాలా ప్రైవేట్ పాఠశాలలలో కనీస మౌలిక వసతులు లేవన్నారు. కర్నూలులోని కీర్తి పాఠశాల గోడకూలి ఒక విద్యార్థి మరణించడం, పదిమంది విద్యార్థులకు తీవ్ర గాయాలు కావడం విచారకరమన్నారు. విద్యాశాఖ అధికారులు ఇప్పటికైనా మేల్కొని ప్రైవేట్ పాఠశాలలను తనిఖీ చేయాలని, నిబంధనలు పాటించని యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## శ్రీ సుబ్రహ్మణ్యస్వామివారికి విశేష అభిషేకం



మనగళం శ్రీశైలం : లోకకల్యాణం కోసం దేవస్థానం ఈ రోజు (16.09.2025) ఉదయం ఆలయప్రాంగణంలోని శ్రీసుబ్రహ్మణ్యస్వామి (కుమారస్వామి) వారికి విశేష పూజలను నిర్వహించడం జరిగింది. ప్రతి మంగళవారం మరియు కృత్తికానక్షత్రం, షష్ఠి తిథి రోజులలో శ్రీ సుబ్రహ్మణ్యస్వామి వారికి ఈ విశేష అభిషేకం మరియు పూజాదికాలు దేవస్థానం సేవగా (సర్కారిసేవగా) నిర్వహించబడుతున్నాయి. కుమారస్వామివారికి పూజలు జరపడం వలన లోకకల్యాణమే కాకుండా ప్రతి ఒక్కరికి ఉద్యోగ, వ్యాపార, వ్యవహారాలలో ఆటుపోట్లు తొలగి ఆయా పనులు సక్రమంగా జరుగుతాయి. సుబ్రహ్మణ్యస్వామి అనుగ్రహంతో శత్రుబాధలు, గ్రహపీడలు, దృష్టి దోషాలు మొదలైనవి తొలగిపోతాయి. అలాగే సంతానం కోసం పూజించేవారికి తప్పక సంతానభాగ్యం లభిస్తుందని చెప్పబడుతోంది. ఈ అభిషేకానికి ముందుగా దేశం శాంతిసౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతివైపరీత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని, పాడి సమృద్ధిగా ఉండాలని, జనులకు ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాలమరణాలు రాకుండా ఉండాలని, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, జనులందరూ సుఖశాంతులతో ఉండాలంటూ అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహాగణపతిపూజ జరిపించబడింది. అనంతరం శ్రీసుబ్రహ్మణ్యస్వామివారికి అభిషేకము, అర్చన తరువాత సుబ్రహ్మణ్యస్తోత్ర పారాయణలు చేయబడ్డాయి. సుబ్రహ్మణ్యస్వామి అభిషేకంలో స్వామివారికి పంచామృతాలైన పాలు, పెరుగు, తేనె, నెయ్యి, కొబ్బరి నీళ్ళు మరియు వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ముఖ్యంగా వివిధ పండ్ల రసాలతో చేసే అభిషేకంతో ఎంతో ఫలితం ఉంటుందని ఆగమాలు చెబుతున్నాయి.

# నిత్య..సేవకుడే

- దిగువ మధ్య తరగతి కుటుంబాన...జన్మించాడు
- వ్యవసాయ,ప్రైవేటు ఉద్యోగ నేపధ్యమున్న ఇంట పెరిగాడు
- తల్లి,దండ్రుల ప్రోత్సాహం అంది వచ్చింది
- ఉన్నత విద్యలను అభ్యసించాడు
- పోటీ పరీక్షలకు...సొంతంగా...నే..ప్రిపేరయ్యాడు
- పదుగురికి సేవ చేసే...పోలీసు శాఖలో..ఎస్సై గా చేరాడు
- పని చేసిన ప్రతి చోటా...చిత్తశుద్ధి,అంకితభావాలతో పని చేశాడు
- అసాంఘిక శక్తుల...పీచ మణిచాడు..అరాచక శక్తుల..పై...ఉక్కు పాదం..మోపాడు
- అ(రి)వార్డులు...అంది వచ్చాయి...ప్రశంసలూ...వెల్లువెత్తాయి
- పదోన్నతి...ఎదురొచ్చి....స్వాగతించింది
- సమాజ సేవలో భాగస్వాములవ్వాలని యువతకు..సూచిస్తున్న...మార్గదర్శి
- ట్వంటీ ఫోర్ బై..సెవెన్...అందుబాటులో ఉంటోన్న..ప్రజాహితైషి
- ఆర్థిక స్వావలంబన సాధించాలని మహిళలకు..సూచిస్తోన్న...మహిళాభ్యుదయవాది
- క్షణికావేశంతో బలవన్మరణాలకు పాల్పడరాదంటోన్న...రైతన్నల పక్షపాతి
- బాధితుల సేవలో అహరహం...ముందుకు సాగడమే జీవితాశయమంటోన్న మనసున్న...మనిషి

...నిగర్వి,నిరాడంబరుడు,నిజవాది, వన్ టౌన్ సర్కిల్ ఇన్స్ పెక్టర్ ఎం.పార్థసారథి...జీవిత విజయ ప్రస్థానమిది...

(యస్.బి.నందకిషోర్,సీనియర్ జర్నలిస్ట్
మొబైల్ నెంబర్ : 80087 88416)

(మన గళం,కర్నూలు) : ”...ఓర్పు,నేర్పు..ఉంటే..చాలు...ఎంతటి కష్ట సాధ్యమైన పనైనా..చేయగలరని నిరూపించారాయన..దిగువ మధ్య తరగతి కుటుంబాన జన్మించిన తాను..ఆర్థిక వెతలను స్వయంగా...చవి చూశారు. విద్యతోనే తన జీవితాన వికాసమన్నది సిద్ధిస్తుందని త్రికరణశుద్ధిగా విశ్వసించిన తాను..విద్యార్జనకు ప్రభుత్వ విద్యా సంస్థలను వేదికగా మలచుకున్నారు. సరైన మౌళిక వసతులు కరువైన ప్రభుత్వ వసతి గదుల్లోనే ఉంటూ,ప్రభుత్వవిద్యా సంస్థల్లో విద్యనార్జిస్తూ,పోటీ పరీక్షలకు ప్రిపేరై,తన తల్లి,దండ్రుల ఆకాంక్షను నింపాదిగా నిజం చేసి, వారు కన్న కలలను...నెరవేర్చి,లక్ష్యసాధకుడయ్యారు....తానే...వన్ టౌన్ సర్కిల్ ఇన్స్ పెక్టర్ ఎం.పార్థసారథి...తన జీవిత నేపధ్యంలోని పలు విశేషాల సమాహారం...మన గళం పాఠకులకు..ప్రత్యేకం...“



స్వగతం :
పూర్తి పేరు : మన్నెపూల పార్థసారథి
తల్లి,దండ్రులు : హనుమక్క,అనంతయ్య దంపతులు
స్వస్థలం : అనంతపురం
పుట్టిన తేదీ : 23.08.1971

కుటుంబ నేపధ్యం : దిగువ మధ్యతరగతి కుటుంబం వారిది. తమ కుటుంబ పెద్దలకు 4 ఎకరాల వ్యవసాయ భూముండేది. తన తండ్రి ప్రైవేటు సంస్థలో చిరుద్యోగం చేసేవారు. తన తల్లి కుటుంబ బాధ్యతల నిర్వర్తణలో తన తండ్రికి చేదోడు,వాదోడుగా ఉండేవారు. వారు వారి తల్లి,దండ్రులకు మొత్తం 5 మంది సంతానం. తాను రెండో వాడిగా జన్మించారు.

> ....వన్ టౌన్ వాసుల...శ్రేయస్సే...లక్ష్యం, వారి...సంక్షేమమే...ధ్యేయం... ...విధి నిర్వహణలో...రాజీ...పడడు...అసాంఘిక శక్తుల...ఆటలు..కొనసాగనివ్వడు... ...ప్రజల ధన,మాన,ప్రాణ...రక్షకుడు...

కుటుంబం : వారికి మే 5,2003న వివాహమైంది. తన జీవిత సహధర్మచారిణి పేరు లక్ష్మి, తాను ఉన్నత విద్యలను అభ్యసించి,కుటుంబ కార్యకలాపాల నిర్వర్తణలో తన భర్తకు తగిన రీతిన సహాయ,సహకారాలను అందజేస్తున్నారు. ఆ దంపతులకు ఇద్దరు సంతానం. వారి పెద్దబ్బాయి పేరు చందన్, తాను ఐఐటి,మద్రాస్ లో చదువుతున్నారు. వారి చిన్నబ్బాయి పేరు లిఖిత్, తాను ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నారు.

విద్యాభ్యాసం : తన విద్యాభ్యాసమంతా ప్రభుత్వ విద్యా సంస్థల్లోనే సాగింది. పదో తరగతి దాకా అనంతపురంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, ఇంటర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో,డిగ్రీ అనంతపురం ఆర్ట్స్ కాలేజీలో పి.జి.కోర్సును ఎస్.కె.యూనివర్శిటీలో, బి.ఎల్.ఐ.సి.కోర్సును ఉస్మానియా యూనివర్శిటీ,హైదరాబాద్ నుంచి ఆయన పూర్తి చేశారు.

తల్లి,దండ్రుల..ప్రోత్సాహమే...నాంది : తన జీవితంలో చిన్ననాటి నుంచి తన తల్లి,దండ్రుల ప్రోత్సాహమే తనకు ఊతమిచ్చింది. ఉన్నత చదువులు చదువుకుంటే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తన తల్లి,దండ్రులు అనునిత్యం చెప్పి, తనను ప్రోత్సహించేవారు. ఈ నేపధ్యంలో గ్రూప్-1 ఆఫీసర్ కావాలని తన తల్లి,దండ్రులు చెప్పడంతో ఆ దిశగా తాను పోటీ పరీక్షలపై శ్రద్ధ పెట్టారు.

యూనివర్శిటీ..ప్రవేశంతో..మేలి..మలుపు : తాను చిన్ననాటి నుంచి యావరేజ్ స్టూడెంటే. అయితే...పి.జి.లో యూనివర్శిటీ ప్రవేశమే తన జీవితాన్నో మేలి మలుపు తిప్పింది. పోటీ పరీక్షలకు ప్రిపేరవుతున్న తన సహధ్యాయులు,సీనియర్లను చూసి, తాను సైతం ప్రభావితుడయ్యాడు. గ్రూప్-1 అధికారి కావాలనుకుని,సొంతంగా పోటీ పరీక్షలకు ప్రిపేరయ్యారాయన.

రుచి-అభిరుచి : తాను శాఖాహార,మాంసాహార వంటకాలను మెనూలో తీసుకుంటుంటారు. అయితే..ఎక్కువగా సాత్వికాహారానికే ప్రాధాన్యమిస్తారు. పప్పు,రసం..ఇలా శాఖాహార వంటకాలను ఇష్టపడతారు. ఇక..అభిరుచుల విషయానికి వస్తే పుస్తక పఠనం, వీలు దొరికితే సందేశాత్మక చిత్రాలను చూసేందుకు ఆయన ప్రాధాన్యమిస్తుంటారు.

బాధ-ఆనందం : దిగువ మధ్య తరగతి కుటుంబానికి చెందిన నేపధ్యంలో తనకు బాధ కలిగించిన సందర్భాలు అనేకమున్నాయి. డబ్బు లేక ఇబ్బందులను ఎదుర్కొన్న ఘటనలు కోకొల్లలు. ఇక..ఆనందించిన సందర్భమంటే..తనకు ప్రభుత్వ ఉద్యోగమొచ్చినదే. తనకు గ్రూప్-1 పరీక్షలు రాస్తే ఎం.డి.ఓ.గా ఉద్యోగావకాశమొచ్చింది. అయితే..ఎస్సైగా అవకాశం రావడంతో తాను పోలీసు శాఖనే ఎంచుకున్నారు.

పోలీసు శాఖలో...ఉద్యోగావకాశం : తనకు 1998లో హైదరాబాద్ లో ఫ్రీ జోన్ లో ఎస్సై గా అవకాశమొచ్చింది. మొదట ఖమ్మం జిల్లా వాజేడులో, ఆనక హైదరాబాద్ నగరం, అంబర్ పేట్, మీర్ చౌక్ లలో విధులు నిర్వర్తించారు. ఆనక రాష్ట్ర విభజనలో భాగంగా పాములపాడు,సి.బెళగల్,ఆలూరుల్లో ఎస్సైగా విధులు నిర్వర్తించారు. పదోన్నతిపై సి.ఐ.గా హైదరాబాద్ సి.ఐ.డి.విభాగానికి వెళ్లారు. అక్కడ 3 ఏళ్ల కాలం పాటు పని చేసి, 2014 లో ఆదోని త్రీ టౌన్ సి.ఐ.గా, ఆనక కర్నూలు ఉమెన్ పి.ఎస్.,కర్నూలు, ఆదోని రూరల్, ఆదోని ట్రాఫిక్,గత ఎన్నికలకు ముందు కడప లోని చెన్నూరు, ఎన్నికల అనంతరం నంద్యాల , ఎన్నికల అనంతరం ఫ్యాక్షన్ జోన్,కర్నూలు, ఆపై ఆగస్టు 11న కర్నూలు వన్ టౌన్ సి.ఐ.గా ఆయన బాధ్యతలు స్వీకరించారు.

విధి..నిర్వహణలో..సమర్థుడే : తాను పోలీసు శాఖలో సమర్ధవంతంగా పని చేశారు. ఖమ్మం జిల్లా,వాజేడు పి.ఎస్.పరిధిలో తాను పని చేసిన సమయంలో ఇద్దరు మావోయిస్టు ఇన్ ఫార్మర్లను అదుపులోకి తీసుకుని, తద్వారా 30 అత్యాధునిక ఆయుధాలను తాను సీజ్ చేసి, ఉన్నతాధికారుల ప్రశంసలకు పాత్రుడయ్యారాయన. ఇదే నేపధ్యంలో తనకు ఎస్.ఐ.బి.





7లో






Editor, Printed, Published and Owned by S. T. KHALEEL BASHA. H.NO. 46-156-E2, BUDHAVAR PETA, KURNOOL DIST. A.P. - 518004.
PRINTED AT G.K PUBLICATIONS, BANDIMETTA STREET, KURNOOL DIST. AP- 518004, RNI : APTEL/ 2017/74310